ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

3 బుధవారం 29 జనవరి 2025



ధాన్యానికే ప్రాధాన్యం

అదనంగా ధాన్యం సేకరణకు కసరత్తు



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, చిత్రంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, కొండయ్య యాదవ్

- గత సమావేశానికి సంబంధించి ఏటీఆర్ సమర్పణ
- జిల్లాను పర్యాటకంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతాం
- డీఆర్సీ సమావేశంలో కీలక అంశాలపై సమగ్ర చర్చ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

"గతేడాది మద్దతు ధరకు ధాన్యం సేకరణ విషయంలో కేవలం 7,000 టన్నులకే పరిమితం చేయడంతో పాటు వాటి తాలూకా బకాయిలు కూడా మా ప్రభుత్వమే చెల్లించింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 50,000 టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అది పూర్తి కాగానే మరో 7,500 టన్నుల వరకు అనుమతులిచ్చాం. ఇంకా అదనంగా మరికొంత ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించే విధంగా సంబంధిత శాఖలతో మాట్లాడి అనుమతులిచ్చేలా చూస్తాం. గత ప్రభుత్వం అత్యంత దుర్మారంగా ధాన్యం కొనుగోళ్లను 7,000 టన్నులకే పరిమితం చేయడంతో పాటు అన్నదాతల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. కానీ ఇప్పుడు అన్నదాతల ఇక్కట్లను తీర్చడమే ప్రధాన ఎజెండాగా ముందుకెళుతున్నాం. ధాన్యం సేకరణ విషయంలో అన్నదాతలకు మేలు జరిగేలా చూస్తాం" అని ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కలెక్టరేట్ వేదికగా మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఆర్సీలో వివిధ అంశాలు ప్రస్తావనకు రాగా ధాన్యం కొనుగోలు విషయంపైనే ప్రధానంగా చర్చ జరిగింది. గతేడాది నవంబరు 5న జరిగిన డీఆర్సీ సమావేశంలో చర్చకు వచ్చిన అనేక అంశాలపై ఏటీఆర్(యాక్షన్ టేకెన్ రిపోర్టు)ను ఇన్‌చార్జి మంత్రి అడిగి తెలుసుకున్నారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పురోగతికి సంబంధించి వివరాలు అడగ్గా త్వరలోనే పనులు పట్టాలెక్కించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. అదే విధంగా కాలువల్లో పూడికతీతలకు సంబంధించి గత సమావేశంలో ప్రధానంగా చర్చకు రాగా ప్రస్తుతం పనుల పురోగతి ఏటీఆర్‌ను ఇన్‌చార్జి మంత్రి అడిగి తెలుసుకున్నారు. అసైన్డ్ భూముల పరాధీనం విషయంలో తీసుకున్న చర్యలను కూడా డీఆర్సీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో జిల్లా మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు కొండయ్య, ఆనంద్‌బాబు, ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ, జేసీ ప్రఖర్‌జైన్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు

నాణ్యత లేకుంటే ఒప్పందాలు రద్దు

రోడ్డు మరమ్మతు పనులలో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించకపోతే ఒప్పందాలు రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గుంతలు పూడ్చే కార్యక్రమం జాప్యం జరగడంపై ఆర్ అండ్‌బీ అధికారులను ఇన్‌చార్జి మంత్రి ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ సీఆర్‌ఎఫ్, ఎండీఆర్‌ఎఫ్ పనులు పెండింగ్ ఎందుకు ఉంటున్నాయని అధికారులను మంత్రి నిలదీశారు. జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ కీలకమని 92 ఎత్తిపోతల పథకాల కింద 1.07 లక్షల ఎకరాలు సాగవుతున్నాయని ఇందులో కేవలం 67 పథకాలు మాత్రమే పనిచేస్తున్నాయని మిగిలిన వాటి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిదం చేయాలని ఆదేశించారు. సూర్యలంక , చీరాల బీచ్ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని మంత్రి చెప్పారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి సంబంధించి రూ.97 కోట్లతో ఇప్పటికే డీపీఆర్‌లు సిద్ధం చేసినట్లు మంత్రి వివరించారు

సూర్య ఘర్ పథకం కింద 334 యూనిట్లు : మంత్రి గొట్టిపాటి

సూర్యఘర్ పథకం కింద ఇప్పటికే 334 యూనిట్లు ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో మరింత విస్తరిస్తామి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి నియోజకవర్గాన్ని ఇందుకు సంబంధించి పైలట్ ప్రాజెక్టుగా తీసుకుంటామన్నారు. కొరిశపాడు ఎత్తిపోతల పథకం కింద భూసేకరణ పూర్తి చేయాలని అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో మత్స్య సంపద వృద్ధికి నాలుగు లక్షల చేపల పిల్లలు వేయాలన్నారు

మరమ్మతు పనుల్లో వేగం పెరగాలి : మంత్రి అనగాని

సాగునీటి కాలువల మరమ్మతుల పనుల్లో వేగం పెరగాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. వెల్లటూరు కాలువ పనులలో జాప్యం తగదన్నారు. రేపల్లె నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు చేపట్టాలన్నారు. రికార్డులు చూపడంలో ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రేపల్లె రహదారులపై గుంతలు పూడ్చడంలో నాణ్యత లోపించడంపై అధికారులను ప్రశ్నించారు

మూడో విడతలో నిధులు : ఎంపీ

బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మాణానికి మూడో విడతలో నిధులు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ డీఆర్సీ సమావేశంలో తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు రుణ సదుపాయం కల్పించడంతో పాటు సూర్య ఘర్ పథకానికి బ్యాంకులు సహకరించే విధంగా చూడాలని ఎంపీ తెన్నేటి కోరారు

డీపీఆర్‌లు పంపాం : కలెక్టర్

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడానికి రూ.3,500 కోట్లతో డీపీఆర్‌లు పంపినట్లు కలెక్టర్ వెంకటమురళి డీఆర్సీలో మంత్రులకు వివరించారు. అమృతధార పథకం కింద 2.16 లక్షల గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి రెండు మండలాలకు నీరందించడానికి రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.

ఎమ్మెల్యేలు మాట్లాడుతూ...

పర్చూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు నిర్వహణ అధ్వానంగా ఉందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డీఆర్సీ సమావేశంలో ప్రస్తావించారు. దాదాపు 40 వేల ఎకరాలు వీటిపై ఆధారపడి ఉన్నాయని, నిర్వహణ సరిగా లేకపోవడంతో రైతులు నష్టాల బారిన పడుతున్నారని ఈ అంశంపై దృష్టి పెట్టాలని అధికారులను కోరారు. లంకగ్రామాలలో తాడిగిరిపాలెం, పోతర్లంక, ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు కోరారు. కాలువల ఆక్రమణలను అరికట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. కాల్వలపై లస్కర్లను నియమించాలని, ఎత్తిపోతల పథకాలకు నిరంతర విద్యుత్ అందించాలన్నారు. చీరాల నియోజకవర్గంలో సాగు పూర్తిగా ఎత్తిపోతల పథకాలపైనే ఆధారపడి ఉందని, వాటి మరమ్మతు పనులు వేగంగా జరిగేలా చూడాలని ఎమ్మెల్యే కొండయ్య కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి గతంలోపంపిన ప్రతిపాదనలకు ఆమోద ముద్రవేయడంతో పాటు నిధుల మంజూరు అంశాన్ని కూడా పరిశీలించాలని మంత్రులను ఎమ్మెల్యే కొండయ్య కోరారు.

సిమెంట్ చాలా పొదుపుగా... కంకర మరింత ఎక్కువగా, ఇసుక ఇంకాస్త దండిగా కలిపేసి కట్టడాలు కట్టేస్తే ఏమవుతుందో అందరికీ తెలిసిందే. అయితే రైల్వే కాంట్రాక్టర్లు మాత్రం దీనిని తూచా తప్పకుండా పాటిస్తూ నిర్మాణాలు చేసేస్తున్నారు. తాము నిర్మిస్తున్న కట్టడాలు అత్యంత పటిష్టతతో ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామనుకుంటున్నారో! లేక రైల్వే పనులేకదా! ఎవరు చూడొచ్చారులే అనుకున్నారో కానీ, ఇష్టమొచ్చినట్టు చేసేస్తున్నారు. అమృత భారత్ పేరుతో కేంద్రం అన్ని రైల్వే స్టేషన్‌లను ప్రయాణీకులకు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు రూ. వేల కోట్లు ఖర్చుపెట్టి నిర్మాణాలు చేపడుతుంటే, వాటిని పట్టుమని పదికాలాలపాటు పదిలంగా ఉండేలా కాకుండా పేకమేడల్లా కట్టేస్తుండటం ఆందోళన కలిగించే విషయం.

- అమృత భారత నిధులతో జరుగుతున్న రైల్వే పనుల్లో డొల్లతనం
- పర్యవేక్షణ అంతంతమాత్రమే
- కాంక్రీట్ పనుల్లో అంతా ఇసుకే
- ఇటుకలూ నాశిరకమే...
- రూ. కోట్ల విలువైన పనుల్లో అంతా తూతూ మంత్రమే

రైల్వే పనుల్లో ఇష్టారాజ్యం



తెనాలి రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులు

తెనాలి, జనవరి 28, (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఏ కాంక్రీట్ మిశ్రమాన్నయినా సిమెంట్, కంకర, ఇసుక 1:2:4 నిష్పత్తిలో కలుపుతారు. అయితే రైల్వే పనులు చేస్తున్న కూలీలను ప్రశ్నిస్తే మాత్రం తడుముకోకుండా 1:4:6 రేషియోలో కలుపమన్నారని చెబుతుంటే, ఆచరణలో మాత్రం 1:7:6 రేషియోలో కలిపేస్తూ కనిపించారు. 1 కట్ట సిమెంట్‌కు బదులు అరకట్ట సిమెంట్, 7 బొచ్చెల ఇసుక, 6 బొచ్చెల కంకర కలిపేసి పనులు చేసేస్తున్నారు. ఇదంతా ప్లాట్ ఫారం పనులకోసం చేస్తుంటే, భవనాలు, ఆధునిక టాయిలెట్స్ మాత్రం ఇంకొంత మెరుగుగా, ఈ పాళ్లను తగ్గించి సిమెంట్ కలిపి కట్టడాలు కట్టేస్తున్నారు. 1వ నంబర్ ప్లాట్‌ఫారం, లోపలి ప్లాట్ ఫారంలపై పనులు జరుగుతుంటే సాయంత్రం వరకు ఒక్క వర్క్‌ఇన్స్‌పెక్టర్ కానీ, ఇంజనీరింగ్ సిబ్బందికానీ లేకుండా, ఎటువంటి పర్యవేక్షణ లేకుండా కూలీలే కాంక్రీట్ ఇష్టమొచ్చినట్టు కలిపేసి కట్టడాలు కట్టేస్తుండటం విశేషం. అయితే సాయంత్రానికి మాత్రం ఒకరిద్దరు వచ్చి, వారు చేసిన పనిని లెక్కవేసుకుని వెళ్లిపోవటం మినహా, కచ్చితమైన పర్యవేక్షణ మాత్రం లోపించింది. దీంతో తాపీ కూలీలే ఇక్కడ ఇంజనీర్‌ల తరహాలో పనులు చేసేయటం, తమ కాంట్రాక్టర్‌కు చెప్పినదానికంటే మరికొంచెం లాభం కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా, పరిమితికి మించి కాంక్రీట్ మిశ్రమాన్ని కలిపేయటం వంటివి ఇక్కడ షరా మామూలయిపోయాయి.

నాణ్యత డొల్లేనా!

ప్లాట్‌ఫారంపై గ్రానైట్ సొబగులు అద్దేలా పనులు చేస్తున్నారు. ఒకటి, రెండు, మూడో నంబర్ ప్లాట్‌ఫారంలపై పనులు జరిగిపోతున్నాయి. అయితే వాటిని అమర్చటానికి కింద కాంక్రీట్ బెడ్ వెయ్యాల్సిఉంటే, దీనిని పూర్తి నిబంధనలకు విరుద్ధంగా కలిపేస్తున్నారు. 1:2:4 నిష్పత్తి పక్కనపెట్టేసి, 1:4:6 అంటూ ఆ రేషియో ప్రకారం కూడా కాంక్రీట్ కలపటంలేదు. మొత్తం ఇసుక, మెటల్ మాత్రమే ఉండటంతో నాణ్యతలో డొల్లతనం ప్రత్యక్షంగానే కనిపిస్తోంది. దీనికి ముందు కాంక్రీట్ పటిష్టంగా ఉండటానికి అంచులవెంట బలంగా ఉండేలా ఇటుక రాళ్లతో నిర్మాణం చేస్తున్నారు. అయితే దీనికి వాడుతున్న ఇటుక నాశిరకంగా ఉంటే, సిమెంట్ వేశారా! లేదా! అన్నట్టున్న మిశ్రమంతో పనులు చేయటం విశేషం. అయితే ఇటుకలు అతికేందుకు వేసిన సిమెంట్ అక్కడక్కడ ఊడిపోయి, రాళ్లు కదిలిపోయి కనిపిస్తున్నాయి. ఇదిలాఉంటే... లోపల మసిపూసి, పైన అందంగా గ్రానైట్ రాళ్లు వెసినా, ప్లాట్‌ఫారం అంచుల వెంట సిమెంట్ చెయ్యాల్సిఉంటే, దీనిలోనూ కక్కుర్తి చూపుతున్నారు. ప్లాస్టింగ్ చేసిన ప్రదేశాల్లో ఇసుక రాలుతున్నట్టు కనిపించటం విశేషం. ఇదికాక ప్లాట్‌ఫారం షెడ్డు వేశాక దానికి ఉపయోగించిన ఇనుప గడ్డర్‌ల వంటి పిలర్ల దగ్గర ప్రయానికులు కూర్చునేందుకు ఇటుకతో ఒంటిరాయి గోడలు నిర్మించి, దానిపై గ్రానైట్ రాళ్లు అమర్చుతున్నారు. అయితే కింద జరుగుతున్న నిర్మాణంలో రాళ్లు ఒక సమస్యయితే, సిమెంట్ సరిగాలేక రాళ్లు అప్పుడే ఊడిపోతున్నాయి. గతంలో ఇదే తరహాలో వేసిన అరుగుల గ్రానైట్ పలకలు పగిలిపోయి కూర్చోటానికి వీలు లేకుండా పగిలిపోయి కనిపిస్తున్నా, మళ్లీ అదే తరహాలో పనులు చేయటం వారికే సాధ్యం. ఇది కాక... ప్రయాణికుల విశ్రాంతి గది, దానిలోనే ఆధునిక హంగులతో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టారు. ఈ తరహాలో రెండు భవనాలు నిర్మాణం జరుగుతుంటే, వాటి పిల్లర్లే కాంక్రీట్ ఊడిపోయి కనిపిస్తుంటే దానిపై సిమెంట్ పూతపూసి సరిచేస్తున్నారు. గోడలు కొంతవరకు పగుళ్లు రాకుండా పర్వాలేదనిపిస్తున్నా, ప్లాస్టింగ్‌లోనూ కక్కుర్తి కనిపిస్తూనే ఉంది. కాంక్రీట్ దిమ్మెలతో జరుగుతున్న నిర్మాణాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి వంటి వాటికి జరుగుతున్న పనుల్లో పిల్లర్ల కాంక్రీట్ పనులు మాత్రం నిబంధనల ప్రకారం జరుగుతున్నట్టు కనిపిస్తున్నాయి. విద్యుత్తు లైన్‌లకు సంబంధించి ఏర్పాటుచేసే బాక్సులకోసం కాంక్రీట్‌తో బాక్సులు నిర్మిస్తుంటే, దీనికోసం కాంక్రీట్‌ను నాశిరకంగా కలుపుతూ కనీసం బొచ్చెలతో కాకుండా ప్లాస్టిక్ కవర్‌లలో కాంక్రీట్‌ను మిక్సర్ నుంచి పోసుకుని బాక్సు గుంతల్లో పోయటం వీరికే సాధ్యమన్నట్టుంది. కనీసం బొచ్చెలు తీసుకుని, దానిలో కాంక్రీట్ పోసుకుని బాక్సులకు పోయటం కాకుండా కవర్‌లతో పోస్తుండటంతో ఆ మిశ్రమంలోని సిమెంట్ నీటి రూపంలో సగం కిందకు కారిపోతూనే ఉంది. వీటినిర్మాణంలో పటిష్టత ఎంతనేది ప్రశ్నార్థకమే. భవన నిర్మానాలకు సంబంధించి ఆధునిక పరికరాలు చాలా వచ్చేస్తే, ఇక్కడ అవేమీ ఉపయోగించకపోగాఎవరూ వాడనటువంటి పద్ధతిలో పనులు చేయటం విశేషం. దీని పై వివరణ కోరేందుకు రైల్వే ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులను సంప్రదిస్తే కిందిస్థాయి అధికారులు మాకు వివరణ ఇచ్చే అధికారం లేదని, ఉన్నతాధికారులనుంచి తీసుకోవాలనే సమాధానం వచ్చింది. రైల్వే ఉన్నతాధికారులకోసం ప్రయత్నం చేస్తే అందుబాటులో లేని పరిస్థితి.



పగుళ్లిస్తున్న అంచులు



ఇసుక కనిపిస్తూ రాలిపోతున్న ప్లాస్టింగ్

భారీ అభివృద్ధి జరుగుతుంటే...

రైల్వేశాఖ పరిధిలో అమృత్‌భారత్ పథకం ద్వారా వివిధ రైల్వేస్టేషన్లను ఆదునీకరించటం, వసతులు కల్పించటం, సుందరంగా తీర్చిదిద్దటం వంటి పనులను చేపట్టారు. దీనిలో తొలి విడత స్టేషన్‌లలో తెనాలి రైల్వే స్టేషన్‌కూడా ఒకటి. ఇక్కడ ప్లాట్ ఫారంల విస్తరణ, ప్లాట్‌ఫారం షెడ్‌ల నిర్మాణం, ఆధునిక వసతులతో టాయిలెట్స్ నిర్మాణం, ప్రయాణికుల విశ్రాంతి భవనాల వంటివి నిర్మిస్తున్నారు. అమృత్ భారత్ కాక, గతిశక్తి కింద ఆరో ప్లాట్‌ఫారం, గూడ్స్ షెడ్ ఏర్పాటు, అంధులకు బ్రెయిలీ లిపితో కూడిన బోర్డ్‌ల ఏర్పాటు, పెయిడ్ వెయిటింగ్ లాబీల వంటివి నిర్మిస్తున్నారు. ఆర్.వి.ఎన్.ఎల్ కింద మూడవ రైల్వే లైన్ నిర్మాణ పనులూ జరుగుతున్నాయి. ఇదికాక గతంలో ఎప్పుడూ నిర్మించని రీతిలో 12 మీటర్ల వెడల్పులో ఫుట్ ఓబర్ బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టారు. దీనిపైనే ప్రయాణికులు వేచి ఉండేలా, స్టాల్స్‌తో సహా అన్ని ఏర్పాట్లు ఉండేలా దీని నిర్మాణం ఉండనుంది. అభివృద్ధి పనులయితే గతంలో లేనిరీతిలో జరుగుతుంటే, పనుల్లో నాణ్యత మాత్రం దారుణంగా తయారయింది.



దేవుని సన్నిధిలో.. సంపూర్ణ సంతోషం

- మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్
- దాతృత్వానికి మారుపేరుగా మారాలి



ప్రార్థనల్లో పాల్గొన్న పాస్టర్లు, భక్తులు

యువతకు.. ఆసరా

- స్కిల్‌హబ్ సెంటర్లలో శిక్షణ
- నెలనెలా జాబ్‌మేళాలతో ఉద్యోగాలు
- ఉత్సాహంగా చేరుతున్న యువతీయువకులు

వేమూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నూతన ఆలోచనలతో యువతకు ఆసరా చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా యువతీయువకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది. తద్వారా శిక్షణ అనంతరం జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలను అందిస్తోంది. దీంతో అనేక మంది స్కిల్‌హబ్ సెంటర్స్‌లో శిక్షణ పొందేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివి ఉన్న యువతీ యువకులు ఈ శిక్షణలో చేరవచ్చు. అడ్వాన్సు టెక్నాలజీ ద్వారా ఉపాధి పొందే విధంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. జిల్లాలో పశుసంవర్ధక శాఖకు సంబంధించిన హెల్త్ ల్యాబ్ సూపర్‌వైజర్లు శిక్షణ ఖాజీపాలెంలో ఐటీఐ, టీఈఎస్ శిక్షణ ఇస్తున్నా రు. చీరాల, పరుచూరు, అద్దంకి కేంద్రాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ ఇస్తున్నారు. బాపట్లలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, వేమూరులో కుట్టు శిక్షణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ అందిస్తున్నారు. ఈ కోర్సుల్లో మూడు నెలల కాలం శిక్షణ పొందాల్సి ఉంది. వేమూరులో కుట్టుశిక్షణలో 60 మంది కోర్సు పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు పొందారు. హెల్త్ ల్యాబ్, కంప్యూటర్ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. కోర్సు పూర్తి అయిన వారికి ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించి కనీస వేతనం రూ.12 వేల నుంచి 25 వేల వరకు వేతనం అందించేలా ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. వేమూరులో కంప్యూటర్ శిక్షణ పొందుతూనే గత నెలలో డాక్టర్స్ కంపెనీలో సందీప్ అనే యువకుడు ఉద్యోగ అవకాశాన్ని సాధించాడు. స్కిల్ హబ్ సెంటర్లను ఏర్పాటు చేసిన మంత్రి నారా లోకేశ్‌కు యువకులు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.



కుట్టు శిక్షణ అనంతరం ఎమ్మెల్యే ఆనందబాబు నుంచి సర్టిఫికెట్లు అందుకుంటున్న యువతులు

శిక్షణ.. ఉపాధి

స్కిల్ హబ్ సెంటర్స్ ద్వారా కంప్యూటర్ శిక్షణలో మంచి అవగాహన కలుగుతోంది. ఇంటర్ పూర్తి చేసుకున్న తర్వాత డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో చేరవచ్చు. అడ్వాన్స్ టెక్నాలజీ ద్వారా కంప్యూటర్ శిక్షణలో మంచి అనుభవాన్ని పొందగలుగుతున్నాము. శిక్షణ కాగానే ప్రభుత్వం అందించే ప్రోత్సాహం ద్వారా తప్పనిసరిగా ఉద్యోగం వస్తుంది.

- గుండపనేని హర్షిత



వేమూరులో కంప్యూటర్ శిక్షణలో పాల్గొన్న యువతులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రవర్మ రాజు

టీడీపీ కూటమితోనే.. అభివృద్ధి

- పవర్‌లూమ్‌తో హ్యాండ్‌లూమ్ కుదేలు
- చేనేతలకు రుణ సాయం అందించాలని ఆదేశాలు
- దేవాంగపురిలో అభివృద్ధి పనులకు మంత్రి పార్థసారథి శంకుస్థాపన

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. చీరాల మండలం దేవాంగపురి గ్రామంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా రూ.47.50 లక్షలతో రోడ్డు నిర్మాణాలు చేశారు. ఆయా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మంత్రి పార్థసారథి, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ అగ్గిపెట్టెలో చీరను అమర్చి బ్రిటీషు వారిని అబ్బుర పరిచిన ఘనత చేనేతలదని కొనియాడారు. ఇటీవల జీఎస్టీతో చేనేత రంగం ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు వివరించారు. పవర్‌లూమ్ కారణంగా హ్యాండ్‌లూమ్ కుదేలవుతున్నట్లు చెప్పారు. ఈక్రమంలో స్థానిక నాయకులు సిద్ధి వెంకట బుచ్చేశ్వరరావు చేనేతలకు ఆధునికీకరణ మిషన్‌లు, రుణ సాయం అందించి ఆదరించాలని కోరగా స్పందించిన మంత్రి వేగవంతంగా రుణ సాయం కల్పించేదిశగా అధికారులకు సూచనలు చేశారు. నియోజకవర్గానికి తాగునీటి కోసం ఇప్పటికిప్పుడే రూ.63 లక్షలు మంజూరు చేయించిన ఘనత కొండయ్యదని అభినందించారు. హౌసింగ్ సాయంలో చేనేతలకు అదనంగా రూ.50 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. నేతన్నలకు అన్ని విధాలా తోడుంటామని చెప్పారు. అనంతరం స్థానిక కూటమి నాయకులు మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డ్వామా పీడీ విజయలక్ష్మి, హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ హైస్కూల్లోని పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

విద్యార్థులూ.. కష్టపడి చదువుకోండి

● కలెక్టర్ అరుణ్‌బాబు



రాజుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

రాజుపాలెం,జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ కష్టపడి చదువుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. మండల కేంద్రం రాజుపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్లోని రికార్డులను పరిశీలించారు. కీర్తన అనే బాలిక ఎందుకు రావడం లేదని హెచ్‌ఎం శైలజను అడిగారు. చాలారోజుల నుంచి ఆ విద్యార్థిని రావడం లేదని ఆమె సమాధానమిచ్చారు. ఎందుకు రావడం లేదో తెలుసుకోవాలని డీఈఓ చంద్రకళకు సూచించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో కొంచెం సేపు ముచ్చటించారు. తరగతి గదిలో చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా లేదా అని వారిని అడిగారు. 'బాగా చదువుతున్నారా? మీకు మెటీరియల్ ఇచ్చారా? అని అడిగి తెలుసుకున్నారు. నలుగురు విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు రావడం లేదని, ద్విచక్రవాహనంపై తిరుగుతున్నారని కలెక్టర్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. సదరు విద్యార్థులను హెచ్‌ఎం గదికి కలెక్టర్ పిలిపించారు. బాగా చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని వారికి చెప్పిన కలెక్టర్, చదువు ప్రాముఖ్యత గురించి వివరించి చెప్పారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పీ పెద్ది రాజు, చారి, పీ సాంబయ్యలు ఆ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామాకాంత్‌రెడ్డి ఉన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 553.90 అడుగులు ఉంది. ఇది 218.45 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 16,800 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 35,638 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఇబ్బంది వద్దు.. అండగా ఉంటా

● ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి నారా లోకేశ్ హామీ



ప్రజాదర్బార్‌లో దివ్యాంగుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్



తాడేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ మంగళవారం నాటికి 58వ రోజుకు చేరింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ లోకేశ్‌కు అర్జీలు ఇవ్వగా, వాటిని ఆయన పరిశీలించారు. 'ఇబ్బంది వద్దు.. అండగా ఉంటా'నని వారికి ఆయన హామీ ఇచ్చారు.

మదర్సాలలో విద్యా వలంటీర్లను క్రమబద్ధీకరించండి

మదర్సాలలో పని చేస్తున్న విద్యా వలంటీర్లను క్రమబద్ధీకరించడంతోపాటు గత వైసీపీ పాలనలో పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు మదర్సా విద్యావాలంటీర్లు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తన భార్య పేరుతో ఉన్న నాలుగు ఎకరాల పొలాన్ని తన పేరుతో ఆన్‌లైన్ చేయాలని సత్తెనపల్లి మండలం రెంటపల్లికి చెందిన రామ్ గోపాల్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తన భార్య రెండేళ్ల క్రితం రెండేళ్ల క్రితం కేన్సర్‌తో చనిపోయిందని, ఆమె పేరుపై మురుకొండపాలెంలో నాలుగు ఎకరాల పొలం ఉందని అధికారులకు చెప్పినప్పటికీ హక్కులు కల్పించలేదని విజ్ఞప్తి చేశారు.

సమ్మర్ స్టోరేజి నిర్మాణం పూర్తి చేయండి

వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సమ్మర్ స్టోరేజి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం సంతెకుడ్లూరు గ్రామస్తులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తాగునీటి సమస్యను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, ఎగువ ప్రాంతానికి తాగునీటి సరఫరా కోసం రెండు వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరు చేయాలని కోరగా పరిశీలించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో బహుజనులకు సంబంధించి రద్దు చేసిన 26 సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతోపాటు ఉద్యమకారులపై నమోదైన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏలూరుకు చెందిన బహుజన సేవా ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎల్‌జీఎస్‌గా పని చేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ డేటా ఎంట్రీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, తిరుపతి టీఎస్‌టీ యూనీ అనుబంధ సంస్థ శ్రీవెంకటేశ్వర ఆటో టాక్సీ వర్కర్స్ యూనియన్ సభ్యులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని యూనియన్ ప్రతినిధులు కోరారు. చిత్తూరు జిల్లా ఐరాల మండలం, పోలకల పంచాయతీలోని జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని పాఠశాల యాజమాన్య కమిటి ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరీక్షా కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఎర్రచెరువుపల్లి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా రాయచోటిలో నివాసం ఉండే తాము 5 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరపసాగు చేయగా నష్టం వచ్చిందని దీంతో గ్రామంలో ఆరు లక్షల వరకు అప్పులయ్యాయని విజయవాడవచ్చిన తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దేవుని సన్నిధిలో.. సంపూర్ణ సంతోషం

● బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్
● దాతృత్వానికి మారుపేరుగా మారాలి

పెదకాకాని, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దేవుని సన్నిధిలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికీ సంపూర్ణ సంతోషం లభిస్తుందని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో వేయబడిన పందిరిలో 87వ బైబిల్ మిషన్ మహోత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరు కున్నాయి. ఈ సందర్భంగా శామ్యూల్ కిరణ్ తన వాక్యోపదేశం కొన సాగిస్తూ... ప్రభువుని స్థిర హృదయంతో హత్తుకొనడం ద్వారా మనలో ఉన్న మాలిన్యం తొలగి పరిపూర్ణ వ్యక్తులుగా మారతామన్నారు. మానవ శరీరంలో అవయవాలన్నీ ఒకే రీతిలో సమిష్టిగా, శ్రద్ధగా పనిచేస్తాయో అదే మాదిరిగా ప్రతి క్రైస్తవ విశ్వాసి భాగస్వామ్యం కలిగి సంఘాల అభి వృద్ధికి దోహదపడాలని పిలుపు నిచ్చారు. నేటి సమాజంలో నిరాశ, నిరుత్సాహం, అభద్రతాభావం వంటి అంశాలతో అనేక మంది ప్రజలు మనోవేదనతో ఉన్నారని తెలిపారు. బైబిల్ గ్రం థంలో ఉన్న బర్నబా అవలంబించిన ఉత్తమ లక్షణాలను, లక్ష్యాలను ఉదహరించారు. దాతృత్వం కలిగిన దాతగా, నమ్మకమైన స్నేహితుడిగా, క్షమాగుణం కలిగిన వ్యక్తిగా, నిత్యం ప్రోత్సాహం అందించే వ్యక్తిగా ఉన్నారని వివరించారు. నేటి సమాజంలో ఉన్న ప్రజలు ఇతరులపై ప్రేమ కనబరు చుట, సత్కా ర్యాలు చేయుట, సహవాసం, స్నేహభావం, సత్ భక్తి, సమాధానంతో పాటుగా పరస్పరం ప్రోత్సహించుకునేందుకు, దాతృత్వం చేసేందుకు నడుం బిగించాలని పిలుపు నిచ్చారు. మరనాత నామస్మరణతో మహోత్స వాల ప్రాంగణం మారు మోగింది.



మాట్లాడుతున్న శామ్యూల్ కిరణ్

రజతోత్సవం

బైబిల్ మిషన్ అధ్యక్షుడు, పెదకాకాని స్వస్థిశాల నిర్వాహకుడు జె. శామ్యూల్ కిరణ్ మహోత్సవాల నిర్వహణ బాధ్యతను చేపట్టి ఈ సంవత్స రానికి 25 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సంద ర్భంగా రజతోత్సవం నిర్వహించారు. ప్రార్థనలు చేశారు. తొలుత కృష్ణా జిల్లా సంగీత బృందం క్రైస్తవ కీర్తనలు ఆలపించారు. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ పీ జాన్ దేవదాసు ప్రార్థన చేశారు.

బైబిల్ గ్రంథంలోని ఏలియా ప్రవక్త గురించి వివరించారు. ప్రపంచ ప్రజలను మేలుకొలిపేందుకు ఈ మహోత్సవాలు దోహదపడతాయ న్నారు. జాయింట్ సెక్రటరీ జే ఆగమనరావు ప్రసంగిస్తూ దేవుని ఆరాధించేవారు కృతజ్ఞత భావం కలిగి ఉండాలన్నారు. ఏసుప్రభువును వెంబడించిన శిష్యులు తగ్గించుకొని ధన్యులయ్యారని, అదే మాదిరిగా ప్రతి ఒక్కరూ తగ్గింపు జీవిత కలిగి ఉండాలని సూచించారు. అనంతరం జే. వినోద్ కుమార్, పాస్టర్లు జీ శామ్యూల్, వీ సతీష్ బాబు దైవ సందే శాలు అందించారు. కాగా, బైబిల్ మిషన్ మహోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి.



హైవే పెగ్ మార్కింగ్ వద్ద అధికారులు, రైతులు

నకరికల్లు అడ్డరోడ్డు - చీరాల ఓడరేవు 167ఏ హైవే పెగ్ మార్కింగ్ ప్రారంభం

నరసరావుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట మండలం రావిపాడు వద్ద మంగళవారం నకరికల్లు అడ్డరోడ్డు-చీరాల ఓడరేవు 167ఏ హైవే పనులు ప్రారంభమయ్యాయి. ముందుగా రావిపాడు సచివా లయంలో రైతులతో గ్రామ సభ నిర్వహించారు. సభలో తాహశిల్దార్ కే వేణుగోపాలరావు, హైవే డీఈ శ్రీనివాస రావు, ఏఈ ప్రకాష్, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొ న్నారు. 167ఏ హైవే బాధితరైతులతో చర్చించారు. వారి అనుమానాలను నివృతి చేశారు. రావిపాడు వద్ద హైవే అధికారులు 3డీ కోసం పెగ్ మార్కింగ్ పనులు డ్రోన్‌లు ఉపయోగించి చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 167ఏ నకరికల్లు అడ్డరోడ్డు-చీరాల ఓడరేవు హైవే, నరసరావుపేట మండలంలో ఐదు గ్రామాల నుంచి వెళుతుందన్నారు. కొన్ని ఇబ్బం దులు ఉన్నప్పటికీ పెగ్ మార్కింగ్ చేసేందుకు రైతులు గ్రామసభలో అంగీకరించినట్లు చెప్పారు. 3డీ ఫిబ్రవరి 22కు అయిపోతుందని, ఈ లోపు రోడ్డు విస్తరణలో భాగంగా పెగ్‌మార్కింగ్ రావిపాడు, గుంటగార్లపాడులలో ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రెండు రోజుల్లో జొన్నలగడ్డ, కేసానుపల్లి, ఇస్సపాలెంలో పెగ్‌మార్కింగ్ ప్రారంభం కానున్నట్లు చెప్పారు. నష్టపరిహారం మార్కెట్ విలువ ప్రకారం పట్టణంలో రెండు రెట్లు, గ్రామాలలో 2.5 రెట్లు అధికంగా చెల్లిస్తారన్నారు. బాగా నష్టపోయేవారికి 10 నుంచి 15 శాతం వరకు అధికంగా చెల్లించేందుకు ఉన్నతాధికారులతో చెప్పారని అన్నారు. కార్య క్రమంలో బాధిత రైతులు, ఇతర అధికారులు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు పూదోట ఆంథోని సునీల్ కుమార్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కే వేణుగోపాలరావు, హైవే అధికారులు శ్రీనివాసరావు, ప్రకాష్, పోలీసు అధికారులు

రంగురాళ్ళ కోసం వెళ్లి కెనాల్‌లో గల్లంతు

● బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో ఘటన



మహమ్మద్ తాజుద్దీన్ (ఫైల్ ఫోటో)

నకరికల్లు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రంగురాళ్ల కోసం తన స్నేహి తులతో కలిసి వెళ్లిన యువకుడు, వాటిని కడిగేందుకని వెళ్లి కెనాల్‌లో కాలు జారిపడి కొట్టుకుపోయాడు. ఈ సంఘటన మండలం త్రిపు రాపురం కొండకు సమీపంలోని బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో మంగళ వారం జరిగింది. ఈ సంఘటనకు సం బంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిరంగిపురంలో నివసించే మహమ్మద్ తాజుద్దీన్, గుంటూరులోని సుభానీ హోటల్‌లో క్యాషియర్‌గా పని చేస్తుంటాడు. మంగళవారం సెలవుదినడం కావడంతో తన స్వగ్రామ మైన పిడుగు రాళ్ళకు వచ్చాడు. తన స్నేహితులు నాదెండ్ల రవి చంద్ర, షేక్ జానీ బాషా, షేక్ అబూ బకర్‌లతో కలసి త్రిపురాపురం కొండ వద్దకు రంగు రాళ్ల కోసం వెళ్లారు. అక్కడ కొన్ని రాళ్ళను ఏరుకున్నారు. ఆ రాళ్లను శుభ్రంగా కడిగేందుకని అక్కడికి సమీ పంలో ఉన్న బెల్లం కొండ బ్రాంచ్ కెనాల్ వద్దకు తాజుద్దీన్ వెళ్లాడు. పాచిపట్టి ఉండటంతో కాలు జారి కాలువలో పడిపోయాడు. ఇది గమనించిన అతని స్నేహి తుడు రవిచంద్ర కెనాల్‌లో దూకి తాజుద్దీన్‌ను రక్షించేందుకు ప్రయత్నం చేశాడు. కొంత దూరం వరకు రవిచంద్ర ఈత కొట్టుకుంటూ వెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తాజుద్దీన్(32) నీటిలో మునిగి పోయాడు. రవి చంద్ర ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరాడు. గల్లంతైన తాజుద్దీన్ కోసం పోలీసులు చర్యలు చేపట్టారు. తాజుద్దీన్ భార్య, ఒక పాప ఉన్నారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం



రొంపిచర్ల, జనవరి 28 (ఆంధ్రజోతి) : మండలంలోని కొత్తపలి సమీపంలోని పొలాల్లో గుర్తుతెలియనివ్యక్తి మృతదేహాన్ని రైతులు మంగళవారం ఉదయం గుర్తించారు. ఈ సమాచారాన్ని పోలీసులకు తెలిపారు. ఎస్ఐ సీహెచ్ మణి కృష్ణ వివరాలు సేకరించారు. రూరల్ సీఐ రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బురదలో కూరుకు పోయి ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి శరీరంపై బ్లూ రంగు టీ షర్టు ఉంది. క్లూస్ టీమ్ వివరాలను సేకరించింది. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 9440796247 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మిర్చియార్డు అధికారులకు సీఎం అభినందన

● రైతులకు ఉచిత భోజనంపై 'ఎక్స్' వేదికగా సందేశం



మిర్చి యార్డు అధికారులను అభినందిస్తూ 'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబు చేసిన పోస్ట్

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు (మార్కెటింగ్) అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అభినందిం చారు. ప్రస్తుత మిర్చి సీజన్‌లో రైతులు ఇబ్బంది పడకుండా ఉదయం అల్పాహారం, మధ్యా హ్నం భోజనం ఉచితంగా పంపిణీ చేస్తున్నందుకు 'ఎక్స్ 'వేదికగా సీఎం అభినందిస్తూ ఒక పోస్టు చేశారు. ఇది కాసేపట్లోనే వైరల్‌గా మారింది. భోజనంతో పాటు కేవలం రూ. 2 నామమాత్ర రుసుంతో సెంట్రలైజ్డ్ ఏసీ సదుపాయం కలిగిన విశ్రాంతి గదులను అందుబాటులోకి తీసు కొచ్చిన విషయాన్నిరైతు కడుపు చల్లగా' అనే శీర్షికతో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో ప్రసారం చేసిన కథనాన్ని చంద్రబాబు వీక్షించి తన స్పందనని ఎక్స్‌లో తెలియ జేశారు. స్వయంగా సీఎం చంద్రబాబు తమని అభినందించడంతో మార్కెటింగ్ శాఖాధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎంతో సహా ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

గుంటూరు (విద్య)జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి అయితానగర్ లోని నన్నపనేని సీతారామయ్య, సరస్వతమ్మ మున్సిపల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ డీఈఓ సివి రేణుక మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీ సమయంలో ఒకేసారి ఏడుగురు ఉపాధ్యాయులు పాఠశాలకు గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఎఫ్ ఏ3 పరీక్షలు ఉన్న సమయంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీంతో పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

రిజర్వ్‌డ్ కేటగిరి మద్యం దుకాణాలకు దరఖాస్తులు

● స్వీకరణకు చివరి తేదీ ఫిబ్రవరి 5
● నరసరావుపేట ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ

నరసరావుపేట లీగల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 335 షాపులను ప్రభుత్వం రిజర్వ్ కేటగిరికి కేటాయించినట్లు నరసరావుపేట ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే మణికంఠ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 13 మద్యం దుకాణాలను రిజర్వ్‌డ్ కేటగిరికి కేటా యించినట్లు తెలిపారు. వీటిలో 9 దుకాణాలను గౌడ కమ్యూనిటీకి, నాలుగు దుకాణా లను గౌడ్ కమ్యూనిటీకి కేటాయించి నట్లు తెలిపారు. అరు లైన, ఆసక్తి గలవారు తమ కుల ధ్రువీకరణ పత్రం, నేటివిటీ సరిఫికెట్ లతో ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపల దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.నాన్ రిఫండబుల్ ఫీజు కింద రూ. 2 లక్షలను డీడీ లేదా చలానా లేదా చెక్కురూపంలో చెల్లించాలని వివరించారు. రిజ ర్వ్‌డ్ కేటగిరి షాపులకు ఫీజు జనరల్ కేటగిరి షాపులో సగం మాత్రమే ఉంటుం దన్నారు. ఈ మేరకు షాపులు కేటాయించి నాలుగు నెలలు కావడంతో ప్రస్తుతం షాపులు పొందిన అనంతరం 2024-25 సంవత్సరానికి సంబంధించి ఫీజు కింద డ్రాలో గెలుపొందిన వారు రూ. 21 లక్షల 66, 667 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 7వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ అరుణ్ బాబు షాపులకు డ్రా తీస్తారని తెలిపారు. కాగా నర్సరావుపేట మున్సిపాలిటీ పరిధిలో గీత కార్మికుల విభాగం కింద గౌడ్ కులానికి ఒక షాప్ కేటాయించినట్లు నరసరావుపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సోమయ్య తెలిపారు. అప్లికేషన్ ఫీజు రూ. 2 లక్షలు నాన్ రిఫండబుల్ అని తెలి పారు. ఒక వ్యక్తి ఎన్ని దర ఖాస్తులు దాఖలు చేసినా ఒక షాప్ మాత్రమే కేటాయిస్తారని తెలిపారు. ఎక్సైజ్ ఏఈ ఎస్ రవీంద్ర పాల్గొన్నారు.



ల్యాప్ ట్యాప్‌ను అందుకుంటున్న కిరణ్మయి, పక్కన రైల్వే అధికారులు

చోరీకి గురైన ల్యాప్‌ట్యాప్ స్వాధీనం

దాచేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జన్మభూమి ట్రెయిన్‌లో సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు ప్రయాణిస్తుండగా రైలులో చోరీకి గురైన ల్యాప్ ట్యాప్‌ను రైల్వే పోలీసు అధికారులు స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశారు. స్థానిక రైల్వే అధికారులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 23న బాపట్లకు చెందిన చింతల కిరణ్మయి, భర్త బోసుబాబుతో కలసి సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు జన్మభూమి జనరల్ బోగీలో ప్రయాణిస్తున్నారు. మార్గ మధ్యంలో పిడుగురాళ్ళ రైల్వే స్టేషన్ దాటిన తరువాత గుర్తుతెలియని దొంగలు ల్యాప్ ట్యాప్‌ను దొంగిలించినట్టు గుర్తించిన వారు, నడికూడి రైల్వే పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసు, బీఎస్ఆర్‌పీ గుంటూరు సబ్ డివిజన్ ఐఆర్‌పీ గుంటూరు లైన్ సర్కిల్ ఆదేశాలతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ల్యాప్ ట్యాప్‌ను దొంగిలించిన ప్రాంతం నుంచి రైల్వే పోలీసులు, సాంకేతిక టెక్నాలజీతో ఛేదించి, చోరీకి గురైన ల్యాప్‌ట్యాప్‌ను బాధితులకు అందజేశారు. నడికూడి రైల్వే పోలీసు స్టేషన్‌లో ల్యాప్ ట్యాప్ అందించిన వారిలో ఎస్ఐ బీ శ్రీనివాసరావు నాయక్, ఏఎస్ఐ ఏ వెంకటరావు, కానిస్టేబుల్ సరికొండ రామ రాజు ఉన్నారు. ల్యాప్ ట్యాప్‌ను అందజేసిన అధికారులకు బాధితులు, వారి కుటుంబ సభ్యులు ధన్య వాదాలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123.132.142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,15,612 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,20,808 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,15,612 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 70,694 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14000	334	8000	13500
నెంబరు. 5	9000	13800	నెంబరు.5	--	--
273	8500	13000	273	--	--
341	8000	15000	341	10000	11500
4884	7700	12500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7000	15000	తేజ	9000	14000
బ్యాడిగి	7000	13000	బ్యాడిగి	9500	11000
దేవనూరు డీలక్స్	9000	13200	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4000	11500	తెల్లకాయలు	5000	8500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

రేపు వేమూరులో జాబ్ మేళా

వేమూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వేమూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్ తెలిపారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, డాక్టర్ బిజినెస్ సొల్యూషన్స్ లిమిటెడ్, స్టార్ యూనియన్ డై ఈచ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు హాజరవుతాయన్నారు. విద్యార్హతలను బట్టి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, ఎంఎస్‌సీ కెమిస్ట్రీ, ఎంబీఏ, పీజీ విభాగాల వరకు చదువుకున్న వారిలో 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 80088 63095లో సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీ పనులు ఎక్కువగా కల్పించాలి : ఎంపీడీవో

పిట్టలవానిపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు కూలీలకు ఎక్కువ కల్పించాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఉపాధి హామీ పనులపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏపీవో సుభాషిణి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు నూరుశాతం తగ్గకుండా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

బాపట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సమీకృత గిరిజన సంక్షేమ వసతి గృహం విద్యార్థినులకు భారత రాజ్యాంగం ఆవశ్యకతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. భావపురి చిల్డ్రన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. ఐద్వా నాయకురాలు టి.సుభాషిణి, సీఐటీయూ నాయకుడు శరత్ పాల్గొన్నారు.

బాధితులకు నిత్యవసరాలు పంపిణీ

నిజాంపట్నం(రేపల్లె), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిజాంపట్నం హార్బర్‌లో ప్రమాదవశాత్తు పెదకాపు నాగమణి, సింగోటి బసవమ్మ రెండు పూరిళ్ళు దగ్ధమయ్యాయి. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గృహాలు కోల్పోయిన వారికి మంగళవారం నిత్యావసరాలు, కూరగాయలు, దుస్తులు, వంట సామగ్రి, బక్కెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటమే రెడ్‌క్రాస్ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ బసవరాజు, సభ్యులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు టెండర్ల ఆహ్వానం

నగరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా కల్లుగీత కులాలకు పది శాతం రిజర్వేషన్ కేటాయించిన మద్యం షాపులకు టెండర్లను ఆహ్వానించారని నగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ మాటూరి శివరామ్‌ప్రసాద్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నగరం మండల సబ్‌స్టేషన్ పరిధిలో గౌడ కులస్తులకు ఒకషాపు కేటాయించటం జరిగిందని, ఈషాపునకు టెండర్లు వేసేందుకు జిల్లాకు చెందిన గౌడ కులస్తులు అర్హులేనని, షాపు టెండరు వేయుటకు ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో లేదా తమ కార్యాలయంలో సమర్పించవచ్చని, ఈ టెండర్‌కు నాన్ రిఫండబుల్ రూ.2 లక్షలుగా నిర్ణయించారని తెలిపారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

డాక్టర్ మోర్ల శ్రీనివాసరావుకు ఎన్టీఆర్ సేవారత్న అవార్డు

పిట్టలవానిపాలెం,జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయాధికారి డాక్టర్ మోర్ల శ్రీనివాసరావును అంతర్జాతీయ మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.చక్రవర్తి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సేవారత్న అవార్డుతో ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో కాకినాడ డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, సెంట్రల్ పోలీసు ఆర్గనైజేషన్ యలమంచలి వెంకటరమణ, తెలంగాణ ఎమ్మెల్సీ మక్కెన కోటిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదగా శ్రీనివాసరావుకు మంగళవారం అవార్డునిచ్చి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా గ్రంథాలయ పాఠకులు, పలువురు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, బంధువులు శ్రీనివాసరావును అభినందించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పేరిరెడ్డి

బాపట్ల,జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బాపట్ల మండల అధ్యక్షుడిగా నక్కా పేరిరెడ్డి, మండల ప్రతినిధిగా ఆడపాల శ్రీరామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగిందని బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి జగన్నాధ శాస్త్రి తెలిపారు. మండల ఎన్నికల అధికారి కేతినేని తిరుపతయ్య ఆధ్వర్యంలో బాపట్ల బీజేపీ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, మండల బూత్ అధ్యక్షుడు గుర్రం శ్రీనివాసగుప్తా, పట్టణ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, నల్లమోతు సుబ్బారావు, శ్యామ్‌ధాన్, చరణ్‌తేజ, వల్లూరి భావన్నారాయణ, ఏడుకొండలు, కె.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, మాధవి, క్రియాశీలక సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పిట్టలవానిపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామపంచాయతీ శివారు పొలాలలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.4,500 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొదటి విడతగా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

● జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ప్రభుత్వం మొదటి విడతగా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ధారించిందని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు కేటాయించటం జరిగిందన్నారు. గత సంవత్సరం నవంబరు 24వ తేదీన మొదటిగా వేమూరు మండలంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించి ఈనెల 15వ తేదీ నాటికి 133 రైతు భరోసా కేంద్రాల ద్వారా జిల్లాకు కేటాయించిన 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యంను రైతుల వద్ద నుండి సేకరించటం జరిగిందన్నారు. జిల్లాలో వాతావరణంలో కొన్నిమార్పులు చోటు చేసుకోవటం వలన రైతులు పండించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అమ్మడం, కొనుగోలు చేయటం చాలా వేగవంతంగా జరిగిందన్నారు. ప్రభుత్వం సేకరించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు రైతుల ఖాతాలలోకి 24 గంటలలోగా జమ చేయటం జరిగిందన్నారు. అప్పటి జిల్లాలో ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ముందుగానే మరొక 25వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదికను పంపటం జరిగిందన్నారు. ఆ తర్వాత వెంటనే విడతల వారీగా మరొక 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. దానిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో రైతులు ఎక్కడైతే తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారో అక్కడి రైతు భరోసా కేంద్రాలకు ధాన్యంను కేటాయించి సేకరించటం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాకు కేటాయించిన 62 వేల మెట్రిక్ టన్నుల ధాన్యంకు గాను 56,272 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించటం జరిగిందన్నారు. ఇంకా 5,728 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగుతున్నదన్నారు. మరికొంత అదనపు లక్ష్యాన్ని కూడా జిల్లాకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరటం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్క రైతు కూడా తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్ముకొని ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరను పొందాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

శ్రీ బగళాముఖికి ఎమ్మెల్యే వేగేశన ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలులో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ దంపతులు, కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళా సందర్భంగా అక్కడ నుంచి తెప్పించిన పవిత్ర నది జలాలతో, 108 కలశములతో శ్రీ బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక కుంభాభిషేకం నిర్వహించారు. అమలాపురం, కాకినాడ నుంచి విచ్చేసి వేదపండితులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అభిషేక జలాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. మహాకుంభమేళ, శ్రీగంగామహాదేవిగా శ్రీ బగళాముఖి అమ్మవారు దేవాలయంలో భక్తులకు దర్శనమిచ్చారు.


శ్రీగంగామహాదేవిగా శ్రీ బగళాముఖి అమ్మవారు, ప్రత్యేక పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కుటుంబ సభ్యులు

డ్రెయినేజిలలో పూడికతీత పనులు వేగవంతం చేయాలి

● మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన డ్రెయినేజీలలో పూడికతీత పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి అన్నారు. బాపట్ల పురపాలక సంఘం పరిధిలోని డంపింగ్ యార్డు, పలు వార్డులలో అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వార్డులలో డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. దోమల బెడద ఎక్కువగా ఉన్నందున ఆయిల్ బాల్స్‌ను వినియోగించాలన్నారు. ప్రతి రోజు వార్డులలో ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ పరిసరాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న గార్డెన్ ఏరియాను, రోడ్ల మార్జింగ్‌లను ఎప్పటికప్పుడు శుభ్ర పర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలక్ష్మికి రాష్ట్ర ఉత్తమ సర్పంచ్ అవార్డు రావటం అభినందనీయం

● డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి


ఆదిలక్ష్మి, వెంకటపతిరాజు దంపతులను సన్మానిస్తున్న డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, గ్రామస్థులు

పిట్టలవానిపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత లక్కంరాజు ఆదిలక్ష్మి, వెంకటపతిరాజు దంపతులను పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి ఘనంగా సన్మానించారు. మండలంలోని మంతెనవారిపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పదవికే వన్నె తేవటం ఎంతో అభినందనీయమని ఆమె అన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సహకారంతో గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని డాక్టర్ గ్లోరియానేట్ ఆకాంక్షించారు. సంగుపాలెం గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ ఎనికేపల్లి శివకుమారి, సంగుపాలెం ఎంపీటీసీ చెన్నుబోయన గంగయ్య, ఎ.మహేష్, గ్రామస్థులు, మండల,గ్రామ టీడీపీ నాయకులు వారిని అభినందించారు.

సర్పంచ్ వెంకటలక్ష్మి దంపతులకు సన్మానం


సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి

కర్లపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకలలో బాపట్ల జిల్లా నుంచి ఏత్రవారిపాలెం పంచాయతీ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులు పాల్గొనటం కర్లపాలెం మండలానికి గర్వకారణమని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. ఢిల్లీ నుంచి ఏత్రవారిపాలెం విచ్చేసి పంచాయతీ కార్యాలయంలో విధులకు హాజరైన సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులను ఎంపీడీవో శ్రీనివాసరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డిలు మంగళవారం దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చీరాల సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి మురళీ కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి

● జనవాణి కార్యక్రమంలో అర్జీ అందజేత

బాపట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గం అడవిపంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన మత్స్యకారులు తమ సమస్యను బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మంగళగిరి జనసేన పార్టీ ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో మత్స్యకార సమస్యను యలమంచలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ కమిషనర్‌కు తెలిపి అర్జీని అందజేశారు. వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతామని చెప్పినట్టు శివన్నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ బాపట్ల మండల అధ్యక్షుడు దాసరి ఏసుబాబు, పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు హుస్సేన్‌బేగ్, లీగల్ సెల్ సభ్యురాలు కత్తి నాగలక్ష్మి పాల్గొన్నారు.


యలమంచలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు అర్జీ అందజేస్తున్న రామచంద్రాపురం మత్స్యకారులు

పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్న ప్రభుత్వం

● పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ జనార్ధనరావు


సమావేశంలో మాట్లాడుతున్న సహాయ సంచాలకుడు డాక్టర్ జనార్ధనరావు

వేమూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పశుపోషకులకు ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక నిధులను కేటాయించడంతో పాటు వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించిన అనంతరం పశుపోషక రైతులకు సదస్సులు ఏర్పాటు చేశారు. జనార్ధనరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 89 గ్రామాలలో 50 వేల పశువులకు, 40 వేల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పశువులకు ఆశ్రయం కల్పించలేని ఎస్సీ, ఎస్టీ దారిద్ర రేఖకు దిగువున ఉన్న పేద పశు పోషకుల పశువులకు ఉపాధి హామీ పథకం ద్వారా 90 శాతం రాయితీపై షెడ్ల నిర్మాణం జరుపుకునేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. 12 ఎకరాలలోని భూముల్లో పశుగ్రాసాల సాగును ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. మూడు సంచార పశు ఆరోగ్య సేవా వాహనాల ద్వారా రైతుల వద్దకే వెళ్లి వారి పశువులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఇన్‌పుట్ సరఫరాలో భాగంగా 16 మంది రైతులకు గడ్డి కోసే కట్టర్‌లను ఇవ్వడం జరిగింది. 34 మెట్రిక్ టన్నుల టిఎంఆర్‌ను 8 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలను సరఫరా చేశామన్నారు. బ్యాంకుల ద్వారా 211 మంది రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులను అందించడం జరిగిందన్నారు. వేమూరు పరిసర గ్రామాలకు చెందిన పలువురు పశుపోషక రైతులు హాజరయ్యారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి : ఎంవీఐ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసన్నకుమారి

కొల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రహదారి భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని బాపట్ల రోడ్డు రవాణా శాఖాధికారి ప్రసన్నకుమారి తెలిపారు. కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల మీ ప్రాణాలతో పాటు ఎదుటి వారి ప్రాణాలకు కూడా భద్రత ఉండదన్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని, రహదారిపై వెళ్లేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రతిఒక్కరూ స్పందించి 108 వాహనానికి సమాచారం అందించాలన్నారు. ప్రమాదాల బారిన పడిన వారిని కాపాడితే కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.5 వేలు నగదు బహుమతి కూడా అందుతుందన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు నిబంధనల కరపత్రాలను డ్రైవర్లకు ఎస్ఐ ఏడుకొండలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు, రోడ్డు భద్రత అధికారి నరేంద్రకుమార్, లారీ యూనియన్ అధ్యక్షులు సాతా సుధాకరరావు, డ్రైవర్లు పాల్గొన్నారు.

జమ్ములపాలెం గ్రామంలో 'పొలం పిలుస్తోంది'

బాపట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం జమ్ములపాలెం గ్రామంలో వ్యవసాయాధికారులు మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ రైతులు మినుములో వివిధ వైరస్ తెగుళ్ళు, మరుక మచ్చల పురుగు, లద్దెపురుగు, వివిధ తెగుళ్ళ నివారణ, సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే పథకాల వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు) జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న పైరులో చీడపీడల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.ప్రసన్నలక్ష్మి అన్నారు. భట్టిప్రోలులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంటను పరిశీలించి కాండం తొలుచు పురుగు ఉనికిని ఏవో గుర్తించారు. రబీ పంట వేసిన రైతులు ఈ-పంట, ఈకెవైసీ నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● నగరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : మినప పంటలో వచ్చే తెగుళ్ళను నివారించటం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి వి.రమేష్ బాబు అన్నారు. మంగళవారం మంత్రిపాలెం, అల్లపర్రు గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినప సాగు పూత దశలో ఉండగా వ్యవసాయ మెలకువలను రైతులకు తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారి కె.నాగశ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలుసులపాలెం, తుమ్మలపాలెం రైతు సేవా కేంద్రాల పరిధిలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఏడీ మహేష్‌బాబు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో ప్రస్తుతం అమలవుతున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సహాయకులు ద్రాక్షాయణి, పద్మజ, రైతులు, నేచురల్ ఫార్మింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు మోక్షం ఎప్పుడో!

● నిర్మాణానికై ఎదురుచూస్తున్న పేదలు, కూలీలు


అన్న క్యాంటీన్ శంకుస్థాపనకు ఏర్పాటు చేసిన శిలాఫలకం

కొల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారా అని కూలీలు ఎదురు చూపులు చూస్తున్నారు. కొల్లూరు మండలం ఇటుక పరిశ్రమకు ప్రసిద్ధి కావడంతో పాటు 365 రోజులు ఇటుక పరిశ్రమల్లో పనులు జరుగుతుంటాయి. కూలీలు, పేదలకు తక్కువ ధరకే అల్పాహారం, భోజనం అందించాలనే ధృడ సంకల్పంతో రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో, నియోజకవర్గాల్లోని కూలీలు ఎక్కువగా ఉండే మండలాల్లో 2019లో అన్న క్యాంటీన్ల నిర్మాణాల కోసం గతంలో టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపనలు కూడా చేశారు. కొద్ది రోజుల్లోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో అన్న క్యాంటీన్లు మూత పడ్డాయి. మళ్లీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం సాధించి అధికారంలోకి రావడంతో వెంటనే వైసీపీ ప్రభుత్వం మూసి వేసిన అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించింది. నియోజకవర్గాల్లో కూడా అన్న క్యాంటీన్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కొల్లూరు మండలంలోనే మళ్లీ అన్న క్యాంటీన్ నిర్మాణం జరిగి ప్రారంభిస్తారని కూలీలు, పేదలు ఎదురు చూపులు చూస్తున్నారు.

సమస్యలపై మంత్రికి ఎమ్మెల్యే వేగేశన వినతిపత్రం అందజేత



బాపట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి పాల్గొన్నారు. బాపట్ల నియోజకవర్గ సమస్యలపై మంత్రి కొలుసు పార్థసారధికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రభుత్వ భూమిలో దర్జాగా ఇంటి నిర్మాణం

● చర్యలు తీసుకోవాలని కోరుతున్న గ్రామస్థులు


ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఇల్లు

బాపట్లరూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ వైఎస్సార్ నగర్ గ్రామశివారులో ప్రభుత్వ భూమిలో కబ్జాదారుడు ఇంటి నిర్మాణం దర్జాగా పూర్తి చేశాడు. వైఎస్సార్ నగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సర్వే నెంబరు 204లో సుమారు 20 సెంట్లకు పైగా భూమిని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుల అండదండలతో కబ్జా చేశాడు. కబ్జా చేసిన స్థలంలోనే ఇంటి నిర్మాణం మొదలు పెట్టి పనులు పూర్తి చేశాడు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన సదరు వ్యక్తిపై రెవెన్యూ అధికారులకు, కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో కూడా ఫిర్యాదు చేసినప్పటికి ఎటువంటి ప్రయోజనంలేదని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఈ అక్రమ కట్టడాన్ని, కబ్జాకు గురైన స్థలంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముందస్తు సమాచారాన్ని వేగవంతంగా సేకరించాలి : ఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు సమాచారాన్ని వేగవంతంగా సేకరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి నిఘా విభాగ పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా నిఘా విభాగ పోలీసులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ సమర్ధవంతంగా విధులు నిర్వహించేందుకు అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేయటానికి ముందస్తు సమాచారం వేగవంతంగా సేకరించటం కీలకమని తెలిపారు. ముందస్తు సమాచారం సేకరించటం వలన ఆదిలోనే నేరాలను అరికట్టి శాంతిభద్రతలను పరిరక్షించవచ్చునన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అమ్మకం, వినియోగం వంటి వాటి మీద ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, కోడిపందాలు వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాల గురించిన ముందస్తు సమాచారం ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ఎవరైనా విధులలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించినా, నిగూఢ రహస్య సమాచారం సేకరించటంలో అలసత్వం వహించిన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్బీ సీఐ నారాయణ, జిల్లా ఎస్బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : సీఐ


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు

రేపల్లె, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పట్టణ సీఐ మల్లికార్జునరావు అన్నారు. చలపతిరావు ఎడ్యుకేషన్ సొసైటీ రామకృష్ణ ఇంగ్లీషు మీడియం స్కూల్లో మంగళవారం పాఠశాల సందర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. యూకేజీ, ఎల్‌కేజీ పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు పట్టుదల, సమయస్ఫూర్తి, అవగాహన వంటి విషయాలను కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కుర్రా అవర్ణ, డాక్టర్ కె.మహేష్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి కేసులో విచారణ ప్రారంభం

చెరుకుపల్లి, జనవరి 28(ఆంధ్ర జ్యోతి) : వడ్డీ విషయంలో తలెత్తిన వివాద నేపథ్యంలో మహిళపై దాడి జరుగగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివరాల ప్రకారం.. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి కోటి సెంటర్‌లో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విలువైన స్థలంలో మూడు అంతస్తుల భవనం ఉంది. దీనిపై అప్పు తీసుకున్న వ్యవహారంలో కొంతకాలంగా వివాదం నడుస్తుంది. ఈనేపథ్యంలో ఈనెల 25న రాత్రి సమయంలో ఇంట్లో ఉన్న శ్రావణిపై వడ్డీ వ్యాపారి కొందరు రౌడీలతో దాడిచేసి సామగ్రిని ధ్వంసం చేశారు. దీనిపై ఆమె జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జునరావు ఘటన స్థలానికి చేరుకుని ఆమెకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. సోమవారం బాధిత మహిళ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన చెరుకుపల్లి ఎస్ఐ టి.అనిల్‌కుమార్ మంగళవారం బాధిత మహిళ ఇంటి వద్ద విచారణ ప్రారంభించారు. వడ్డీ వ్యాపారి నుంచి తమకు ప్రాణహాని ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

పేదలకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు) జనవరి 28 : భట్టిప్రోలు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ప్రముఖ చేనేత వస్త్ర వ్యాపారి పాలకుర్తి సీతారామయ్య వర్ధంతి పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సహకారంతో దేవస్థాన అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షణలో పేదలకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

మండలంలో పింఛన్‌ల తనిఖీ కార్యక్రమం

నగరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న 12 మంది దీర్ఘకాలిక రోగుల పింఛన్‌లను ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు గవర్నమెంట్ హాస్పటల్ నుంచి వచ్చిన వైద్యులు పరిశీలించారు. ఆర్థోపెడిక్ డాక్టర్ శైలేంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.క్రీస్తుదాసు లబ్ధిదారుల గృహాలకు వెళ్ళి వారి మెడికల్ సర్టిఫికెట్లు తదితర వివరాలను పరిశీలించారు. రోగుల శారీరక పరిస్థితులపై రిపోర్టులను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.జాన్ ప్రసాద్, డాక్టర్ ఎస్కే నజీలాపర్వేన్, డాక్టర్ తులసీ రాజేశ్వరి, డాక్టర్ మంజూషా, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ బాబూరావు, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



జంపని షుగర్ ఫ్యాక్టరీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నన్నపనేని వెంకట్రావు 45వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఫ్యాక్టరీ ఆవరణలో పలువురు ఉద్యోగులు, టీడీపీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వేమూరు (ఆంధ్రజ్యోతి)

గ్రేటర్ వినుకొండే లక్ష్యం

రూ.159 కోట్ల పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు

3000 గృహాల నిర్మాణం.. పేదలకు నివేశ స్థలాల పంపిణీ

అక్షరం అండ.. పరిష్కారమే అజెండా వేదికగా జీవీ హామీలు

వినుకొండ, నరసరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'గ్రేటర్ వినుకొండే లక్ష్యం. చుట్టపక్కల ప్రాంతాలను విలీనం చేసి వినుకొండను మహా పట్టణంగా తీర్చి దిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాను. రూ.159 కోట్ల వ్య యంతో నిలిచిపోయిన తాగునీటి పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తా. ఎన్టీఆర్ టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం. 3000 గృహాలు నిర్మిస్తాం. పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేస్తాం..' అని ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనే యులు తెలిపారు. గాయత్రీనగర్‌లో పర్యటన అనంతరం ఆంధ్రజ్యోతి నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా వేదికపై జీవీ ప్రసంగించారు. వీధుల్లో పర్యటన, ప్రజల నుంచి అర్జీల స్వీకరించిన అనంతరం ఆయా సమ స్యలపై ఆయన స్పందిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా మని భరోసా ఇచ్చారు. వినుకొండలో అక్షరం అండగా.. పరిష్కా రమే అజెండాగా.. కార్యక్రమాన్ని నిర్వహించినం దుకు ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని 23, 31 వార్డుల్లో అధికారులతో కలిసి జీవీ పర్యటించగా పలువురు సమస్యలపై వినతిప త్రాలు అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను జీవీతో పాటు అధికారులకు ప్రత్యక్షంగా చూపారు. మున్సి పల్ అధికారులను, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులను తమ వద్దకు నేరుగా తీసుకొచ్చి సమస్యల పరిష్కార వారధిగా నిలిచినందుకు కాలనీవాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞ తలు తెలిపారు. తాము ఎంతోకా లంగా ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరిస్తామని జీవీ హామీ ఇవ్వడం ఎంతో సంతో షంగా ఉందన్నారు. సమస్యలపై బాధితుల అభిప్రాయాలు.

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

ఇళ్లలోకి వర్షపు నీరు



చిన్నపాటి వర్షం వచ్చినా ఇళ్లలోకి మురుగు నీరు వస్తుంది. గుంటి ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి మురుగునీరు పెద్ద మసీదు మీదగా మార్కాపురం రోడ్డుకు ప్రవహించాలి. డ్రెయినేజీ స క్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరు తుంది. ఎవరికైనా బాగలేకపోయినా అంబు లెన్స్ కూడా రావడానికి సరైన మార్గం లేదు. సమస్యలపై గత ప్రభుత్వంలో ఎన్నో సార్లు చెప్పినా ఫలితం లేదు. కనీసం మీరైన మా బాధను అర్థం చేసుకొని రోడ్డు సౌకర్యం కల్పించాలి.

-పఠాన్ కరీంబీ

తాగునీరు అందడం లేదు



ఆయుబ్‌ఖాన్ ఇంటి వెనుక బజారకు ప్రధాన రహదారికి ఎత్తులో ఉండడంతో తాగునీరు అందడం లేదు. నీటి కోసం పనులు మానుకుని ఇళ్ల వద్దనే ఉండాల్సి వస్తుంది.

- షేక్ ఆయూషా

మౌలిక వసతులు కరువు



మున్సిపాల్టికి పన్నులు చెల్లి స్తున్నాం. కాని మా ప్రాం తంలో మౌలిక వసతులు ఏర్పాటుచేయలేదు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆంధ్రజ్యోతి చొరవతో అయినా తమకు మౌలిక వ సుతుల ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరించాలి.

- గంగినేని రాఘవ, గాయత్రీనగర్

పనులు చేపట్టాలి



గాయత్రీనగర్‌లో తాగునీటి సరఫరా కోసం చేపట్టిన రెండు ట్యాంకు నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో అర్ధాంత రంగా ఆగిపోయాయి. ఆ పను లు చేపడితే మా ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కార మవుతుంది. వెంటనే ట్యాంకు పనులను చేపట్టాలి.

-కంచుమాటి వీరాంజమ్మ



31వార్డుల్లో డ్రెయినేజీని పరిశీలిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

రోడ్లు తవ్వి వదిలేశారు



23వ వార్డులో వార్డుల్లో సమస్యలపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీకి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

23వ వార్డులో పెద్ద మసీదు బజారు వ రకు గత ప్రభుత్వ హయాంలో పైపులైన్లు మరమ్మతులు పనుల కోసం సిమెంట్ రోడ్లు, కాల్వలను తవ్వేశారు. పూర్తిగా ధ్వంసం చేశారు. పైపులైన్ల మరమ్మతుల అనంతరం రోడ్లు, కాల్వలను బాగు చేయకుండా వదిలేశారు. రోడ్లు, కాల్వలను బాగు చేసి ఇబ్బందులను పరిష్కరించాలని అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడ్ని, అధికా రులను ఎన్నిసార్లు కోరినా పొంతనలేని సమాధానాలతో తప్పించుకున్నారు.

-పఠాన్ ఖాశింఖాన్‌బజారు నివాసితులు

అభివృద్ధి పనులు జరగలేదు

31వ వార్డు పరిధిలోని లక్ష్మీపురం నుంచి మున్సిపాల్టీకి అత్యధికంగా పన్నులు చె ల్లిస్తున్నాం. పన్నుల చెల్లింపులో మేము ముందున్నాం. కాని సమస్యలను పరిష్కరిం చడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారు. వీధిలైట్లు వెలగడం లేదు. వెంచ ర్ నిర్వాహకులు వేసిన సీసీ రోడ్లు తప్ప మున్సిపాల్టీ నుంచి ఒక్క రూపాయతో అభి వృద్ధి పనులు జరగలేదు. తాగునీరు అందని పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

-లక్ష్మీపురంవాసులు



31వార్డుల్లో స్థానిక ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరిస్తున్న జీవీ ఆంజనేయులు

గత ప్రభుత్వంలో ప్రచార్భాటమే..

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ధాన్యం సేకరణ విషయంలో ప్రతి గింజా కొంటామనే ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది తప్ప అన్నదాతలను ఆదుకోలేదని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బాపట్ల కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం మంత్రులు గొట్టిపాటి, అనగానితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వం మద్దతు ధరకు సేకరించిన ధాన్యం కేవలం 7,000 టన్నులేనని, జిల్లాలో ఇప్పటికే 57,000 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశామని, మరో 25,000 వరకు ప్రతిపాదనలు పంపామని, అన్నదాతల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులేస్తున్నామని మంత్రి పార్థసారథి తెలిపారు. గత ప్రభుత్వంలో మంచి చేయాలనే తపన లేకుండా పనిచేయడం వల్లనే రెవెన్యూ సదస్సుల్లో పెద్దసంఖ్యలో అర్జీలు వస్తున్నాయని మంత్రి అనగాని తెలిపారు. పరిష్కారం అవకాశం ఉన్నవాటి విషయంలో వెంటనే ఫలితం చూపెడుతున్నామని, దాదాపు 30 శాతం అర్జీల విషయంలో సాంకేతిక పరమైన చిక్కులు ఇమిడి ఉన్నందువల్ల చేయలేకపోతున్నామని అదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నామని, వాటిని పకడ్బందీగా, పారదర్శకంగా పరిష్కరించేలా అన్ని చర్యలు చేపడుతున్నామని మంత్రి అనగాని అన్నారు. ధాన్యం కొనుగోలు ఇంత పెద్ద ఎత్తున ఎప్పుడు జరగలేదని, గత ప్రభుత్వం పెండింగ్ ఉంచిన రూ.1800 కోట్ల బకాయిలను కూడా తమ ప్రభుత్వం చెల్లించిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయడం అనేది గతంలో ఎన్నడూ లేదన్నారు. ఎక్కడో ఒకటి, రెండు చోట్ల ధాన్యం కొనుగోళ్లలో ఎదురైన ఇబ్బందులను మొత్తం ప్రక్రియకే అంటగట్టే ప్రయత్నం చేయొద్దని మంత్రి గొట్టిపాటి సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, పక్కన మంత్రులు గొట్టిపాటి, అనగాని

తపాలా బలోపేతంపై దృష్టి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



ఎర్రబాలెం పోస్టాఫీసు వద్ద స్థానికులు, సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

మంగళగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తపా లా శాఖను ఆర్థికంగా బలోపేతం చేయడంపై దృష్టి సారించామని కేంద్ర సహాయమంత్రి డాక్ట ర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కుంచనప ల్లి, ఎర్రబాలెంలోని పోస్టాఫీసులను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఉద్యోగులు, స్థానికులతో పెమ్మసాని చ ర్చించారు. తపాలా కార్యాలయాలను కాస్ట్ సెం టర్ నుంచి ప్రాఫిట్ సెంటర్లుగా మార్చేందుకు ఏయే చర్యలు తీసుకోవాలనే అంశమై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగుల జీతాలు, ఇన్సెంటివ్‌లు ఎ లా అందుతున్నాయి.. ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఎ లా ఉన్నాయని సిబ్బందిని మంత్రి ప్రశ్నిం చారు. తపాలా శాఖకు ప్రస్తుతం రూ.13 వేల కోట్ల మే ర ఆదాయం వస్తుంటే ఖర్చులు రూ.35వేల కోట్ల వరకు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితులలో సంస్థ ను గట్టెక్కించేందుకు ప్రతీ ఉద్యోగి చిత్తశుద్ధితో శ్రమించి పని చేయాలని సూచిం చా రు. స్థాని కులు కూడా మంత్రి పెమ్మసానితో మాట్లాడు తూ తపాలా శాఖ ఉన్నతికి పలు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, టీడీపీ తాడే పల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, జ నసేన అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కానుగోలు కోటేశ్వరరావు, మంగళగి రి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు సత్యనారా యణ, అరుణ, ఆకుల ఉమామహేశ్వరరావు, త పాలా శాఖ సీపీఎంజీ ప్రకాష్, పోస్టల్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి, పోస్టాఫీసు సూపరింటెండెం ట్ యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు నుంచి విశాఖపట్నంకు ఏసీ సర్వీసుల సౌకర్యం కల్పించాలి

● డయల్ యువర్ డీఎంలో విజ్ఞప్తి

గుంటూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి విశాఖపట్నంనకు రాకపోకలు సాగించేందుకు ఏసీ సర్వీసుల సౌకర్యం కల్పించాలని గుంటూరు నగరానికి చెందిన మోహన్‌రావు డయల్ యువర్ డిపో మేనేజర్‌లో విజ్ఞప్తి చేశారు. గుంటూరు-2 డిపో మేనేజర్ డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. ఈసందర్భంగా ముగ్గురు ప్రయాణికులు పలు అంశాలపై ఫోన్ చేశారు. మంగళగిరి నుంచి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరి - గుంటూరుకు ఉదయం 8.20 గంటల నుంచి 9.20 గంటల వరకు బస్సులే లేవని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన డీఎం స్థానిక మంగళగిరి డీఎంకు తెలియజేసి పరిష్కరిస్తామన్నారు. అలానే గుంటూరుకు చెందిన జ్ఞానయ్య గుంటూరు నుంచి జూబ్లీ బస్టాండ్‌కు, మేడ్చల్‌కు బస్సులు నడపాలని కోరారు.

నేడో.. రేపో పోలీస్ కార్యాలయానికి డీజీపీ

ఇంటిగ్రేటెడ్ సీసీటీఎన్‌ఎస్... సీసీ కెమెరాల సంపూర్ణ పర్యవేక్షణ విభాగాల ఆవిష్కరణ

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణ, కేసుల చేదనకు సాంకేతిక పరిజ్ఞానం దిశగా పోలీస్ శాఖ మరింత చేరువ అవుతుంది. దీనికి సంబంధించి పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటుచేసిన సీసీ టీఎన్‌ఎస్ ప్రాజెక్టుతో పాటు జిల్లావ్యాప్తంగా ఇప్పటికే అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించి సంపూర్ణ పర్యవేక్షణ విభాగాన్ని డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆవిష్కరించబోతున్నారు. ఇందుకుగాను ఆయన బుధ లేదంటే గురువారాల్లో నగరానికి రానున్నారు. గుంటూరు నగరానికి చెందిన ద్వారక తిరుమలరావు డీజీపీగా ఉన్నారు. ఆయన ఈ నెలా ఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సొంత గడ్డపై చివరిసారిగా అభివృద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొనబోతున్నారు. పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ఆయా అభివృద్ధి కార్యక్రమాలను డీజీపీ ఆవిష్కరించబోతున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా సిసిటిఎన్‌ఎస్ విధానం అమల్లో ఉంది. పోలీస్ స్టేషన్లో నమోదయ్యే ఎఫ్ ఐ ఆర్ లు మొదలు, నిందితుల వివరాలు అలాగే నేరస్తులు, రౌడీ షీటర్లు, తీవ్రవాదులు, మావోయిస్టులాంటి వారందరి ఫోటోలతో సహా డేటాను ఎప్పటికప్పుడు సీసీటీఎన్‌ఎస్ లో అప్లోడ్ చేస్తున్నారు. సీసీ టీఎన్‌ఎస్ ద్వారా దేశంలో ఎక్కడి నుంచైనా ఏ నేరస్తుడి గురించైనా చిటికెలో తెలుసుకునే సౌలభ్యం ఉంది. ముఖ్యంగా ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో డేటాను ఆ స్టేషన్ లో క్షణాల్లో తెలుసుకోవచ్చు. అయితే జిల్లాకు సంబంధించిన డేటాతో పాటు సీసీటీఎన్‌ఎస్ సంబంధించిన వివరాలను పోలీస్ కంట్రోల్ రూమ్ లో తెలుసుకునేందుకు కొంత జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆజాప్యాన్ని నిలువరించేందుకుగాను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాఫ్ట్వేర్ అప్డేట్ చేశారు. ఈ క్రమంలో ఇంటిగ్రేటెడ్ సీసీ టీఎన్‌ఎస్ విధానాన్ని డీజీపీ ఆవిష్కరించబోతున్నారు.

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న సీసీ కెమెరాలు అన్నింటిని ఒక్కొక్కటిగా పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ తో అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికే పోలీస్ శాఖ జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. వాటితోపాటు ప్రైవేటు వ్యక్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటన్నింటినీ కూడా పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఆయా సీసీ కెమెరాలు కూడా అప్‌డేట్ చేస్తున్నారు. ఆయా సీసీ కెమెరాలన్నింటికి వాయిస్ కమాండ్ ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.75 నుంచి 80 లక్షల వరకు నిధు లు కేటాయించబోతోంది. ఈ క్రమంలో డీజీపీ కంట్రోల్ రూమ్ లోని ఓవరాల్ మానిటరింగ్ సిస్టం కూడా ఆవిష్కరించబోతున్నారు.

చెన్నైలో కిడ్నాపైన బాలుడు సురక్షితం

ఐదుగురు నరసరావుపేట మహిళల అరెస్టు

ఈ నెల 12న సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో చిన్నారి అపహరణ

సీసీ కెమెరాల ఫుటేజ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ఓ బాలుణ్ని కిడ్నాప్ చేసిన కేసులో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఐదుగురు మహిళల్ని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి చెర నుంచి ఆ బాలుణ్ని రక్షించారు. అసోంకు చెందిన సచితాబేగం తన ఆరేళ్ల కుమారుడు సకీబుద్దీన్‌తో కలిసి ఈ నెల 12వ తేదీన చెన్నై సెంట్రల్ స్టేషన్ చేరుకున్నారు. సుదూర ప్రయాణం చేసిన ఆమె అలిసిపోయి స్టేషన్‌లోనే బాలుడితో కలిసి నిద్రపోయారు. ఆమె నిద్ర లేచేసరికి సకీబుద్దీన్ కనిపించలేదు. దీంతో సచితాబేగం పోలీసులను ఆశ్రయించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. ఆ బాలుణ్ని ఓ మహిళా ముఠా ఎత్తుకెళ్లినట్టు గు ర్తించారు. స్థానిక వ్యాసర్పాడి పోలీసుస్టేషన్ వద్ద నమోదైన సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా బాలుణ్ని కిడ్నాప్ చేసింది చెన్నైలో బిక్షమెత్తుకుంటున్న మహిళా ముఠా అని గుర్తించారు. అనం తరం ఈ నెల 26న నరసరావుపేట వెళ్లిన పోలీసులు.. సరస్వ తి, సత్యవతి, వీర అంజమ్మ, ఉమా, అంజమ్మ అనే ఐదుగురు మహిళల్ని అరెస్టు చేశారు. వారి చెరలో ఉన్న బాలుణ్ని రక్షించారు. ఈ ఐదుగురు మహిళలు గతంలోనూ ఇలాంటి కిడ్నాప్ ప్రయత్నాలకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.



చెన్నై పోలీసులు అరెస్ట్ చేసిన మహిళలు

పోలీసుల అండదండలతో జోరుగా కోడి పందాలు

రేపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తీరంలో సంక్రాంతి పండుగ వెళ్ళినా రేపల్లె నియోజకవర్గంలో కోడిపందాలు జోరు మాత్రం తగ్గలేదు. అధికార పార్టీ నాయకులు, పోలీసుల అండదండలు పుష్కలంగా ఉండటంతో జూద క్రీడలకు తీర ప్రాంతం అడ్డాగా మారింది. కోడిపం దాలను నియంత్రించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైనా చూసిన దాఖలాలు లేవు. నియోజకవర్గంలోని నిజాంపట్నం మండలం అడవులదీవి, దిండి మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు పోలీసు లను అడ్డుపెట్టుకుని జోరుగా కోడిపందాలు కొనసాగిస్తున్నారు. నియోజ కవర్గంలోని పందెం రాయుళ్ళతోపాటు కృష్ణ, బాపట్ల జిల్లాల నుంచి పందెంరాయుళ్ళు వేలాదిగా తరలి రావటంతో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. మంగళవారం భారీగా బరులను ఏర్పాటు చేసి జోరుగా కోడిపందాలు నిర్వహించారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మాత్రం రాజకీయ నాయకుల ఆదేశాలకు తలొగ్గి తమ కేమీ పట్టనట్లు మిన్నకుండి పోతున్నారు. దీంతో పందెం రాయుళ్ళు లక్షలాది రూపా యలతో పందాలు కాయడం, జనం పెద్ద సంఖ్యలో ఈ పందాలను వీక్షించారు. వేలాది మంది కోళ్ళు పట్టుకుని పందాలు వేసేందుకు తరలి వచ్చారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన కోడిపందాల బరిల్లో జోరుగా కోడిపందాలు నిర్వహించారు. కోడిపందాల రాయుళ్ళు ఒక్కసారిగా గ్రామం లోకి చేరుకోవటంతో వందలాది ద్విచక్ర వాహనాలు ప్రత్యక్షమై ఇసుకవేస్తే రాలనంత జనంలో కోలాహలంగా పందాలు సాగాయి. కోడి పందాల బరుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు బరుల వద్దే జరిగాయి. నిర్వాహకులు కమీషన్ల రూపంలో సొమ్ము చేసు కుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకో వాలని తీర ప్రాంతవాసులు కోరుతున్నారు.



అడవులదీవి పంచాయతీ శౌరివారిపాలెంలో కొనసాగుతున్న కోడిపందాలు

చోరీలతో హడలెత్తిస్తోన్న దొంగల అరెస్టు

- ఇద్దరూ కడప జిల్లా వాసులే..

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వరుస చోరీలతో హడలెత్తిస్తోన్న కడప జిల్లాకు చెందిన ఇరువురు నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 28 లక్షల ఖరీదైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన దొంగతనాల కేసులకు సంబంధించి సీసీఎస్ పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. వీరిలో కడప జిల్లాకు చెందిన ఆకుల శ్రీను, మహేష్‌లతో పాటు తమిళనాడు రాష్ట్రం వెల్లోర్ జిల్లా పెర్నంభట్టు మండలం పస్నీర్‌కొట్టై గ్రామానికి చెందిన చంద్రన్ అనే వారు జిల్లాలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రస్తుతం పాత రాజీవ్ గృహకల్ప, అడవితక్కెళ్ళపాడులో ఉంటున్న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఆకుల శ్రీను, కడప జిల్లా గుమ్మడిన్నె మండలం అశ్వతు గారి పల్లె గ్రామానికి చెందిన నాగ దాసరి మహేష్ అనే ఇరువురిని ఆరు చోరీ కేసుల్లో అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 28 లక్షల ఖరీదైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఆకుల శ్రీను అనే వ్యక్తి పై రాష్ట్రంలోనీ పలు జిల్లాల్లోని పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే 50కి పైగా కేసులు నమోదయ్యాయన్నారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో సస్పెక్ట్ షీట్ కూడా ఉందన్నారు. అలాగే నాగ దాసరి.మహేష్ అను వ్యక్తి మీద కూడా రాష్ట్రంలోనే వివిధ పోలీస్‌స్టేషన్లో సుమారుగా 35 కేసులు ఉన్నట్లు తెలిపారు. చంద్రన్ అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులు చేదించడంలో కృషి చేసిన క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ సుప్రజ, సిసిఎస్ డిఎస్పి శివాజీ రాజు , సీఐలు సుబ్బారావు, బత్తుల శ్రీనివాసరావు, అల్తాఫ్ హుస్సేన్ వారి సిబ్బందినీ అభినందించి వారికి ప్రశంసా పత్రాలు అందించారు.



రికవరీ చేసిన చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ సుప్రజ తదితరులు

గోరింకల సందడి



గోరింక.. సందడి.. గాల్లో ఎగురుతూ కరెంటు వైర్లపై కలిసికట్టుగా వాలిన అద్భుత దృశ్యం చూపురలను కట్టిపడేసింది. స్థానిక పత్తిపాడు రోడ్డులోని పొలాల్లో గింజలు తినేందుకు భారీ సంఖ్యలో గోరింక పక్షులు వచ్చాయి. ఇక్కడ విద్యుత్ వైర్లపై బారులు తీరిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. రోడ్డుపై వాహన శబ్దాలకు భారీ సంఖ్యలో పక్షులు గాల్లో ఎగురుతూ ఆకాశంలో అద్భుత దృశ్యాలు ఆవిష్కరించాయి.

- ఆంధ్రజ్యోతి గుంటూరు





పర్చూరులో మురుగు కాలువలను పరిశీలించి, లిక్విడ్‌ను పిచికారీ చేయిస్తున్న జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్

దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్

పర్చూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దోమల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపీనాథ్ అన్నారు. సీజనల్ వ్యాధులు, రాజోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మురుగునీటి కాలువలు, దోమలు, వాటి లార్వాలను పరిశీలించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పర్చూరులోని పలు డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. ఎక్కడ చూసినా దోమలు, లార్వా ఉధృతి, అస్తవ్యస్తంగా డ్రైనేజీ, మురుగు నీరు నిల్వ ఉండడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. దోమల నివారణకు ఎబెట్ ద్రావణం పిచికారీ చేస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అయితే ఎక్కడ ఎబెట్ ద్రావణం అందుబాటులో లేదని అధికారులు సైతం చెప్పడం గమనార్హం. అందుబాటులో ఉన్న లిక్విడ్ బ్లీచింగ్ ద్రావణాన్ని మురుగు కాలువలో పిచికారీ చేయించారు. దీంతోపాటు, గ్రామంలోని పలు డ్రైనేజీ కాలువతోపాటు, పాఠశాలల్లోని ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో చీరాల ఎస్‌యూవో రవికుమార్, సీహెచ్‌వో రావి వరలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేయాలి

అద్దంకిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మండలంలోని బీసీ, ఈబీసీ సబ్సిడీ రుణాలకు సంబంధించి లబ్ధిదారులు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీలోపు దరకాస్తులు వెరిఫికేషన్, 10వ తేదీలోపు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి, అర్హులైన బీసీ, ఈబీసీ లబ్ధిదారులకు రుణాలను అందజేస్తారన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

- 30 నుంచి ఆన్‌లైన్‌లో పంపాలి
- వచ్చేనెల 8వ తేదీ వరకు గడువు
- ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలునగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలకు ఈనెల 30వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. వచ్చే నెల 8వతేదీ వరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వెనుకబడిన తరగతులవారితో పాటు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆ ర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన వారు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్వయం ఉపాధి పథకాలు స్థాపించుకునేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీతో ఈ రుణాలను మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు. వీటితోపాటు ఫార్మసీ పూర్తి చేసిన ఆయా వర్గాలకు చెందిన నిరుద్యోగులు జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్చి 10 నుంచి 20వ తేదీ వరకు యూనిట్ల గ్రౌండింగ్ జరుగుతుందని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణం పొంది ఏర్పాటు చేసుకున్న ప్రతి యూనిట్‌ను జియో ట్యాగింగ్ చేస్తారని ఆయన తెలిపారు.

కేన్సర్ స్క్రీనింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



స్కానింగ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు స్థానిక వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలోని సమావేశపు హాలులో మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులు, ఏఎన్ఎంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది నవంబరు 14నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభమైన ఇంత వరకు కొన్ని ప్రాంతాల్లో లక్ష్యాలను పూర్తి చేయలేదన్నారు. అటువంటి ప్రాంతాల్లో వెంటనే పరీక్షలు పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఎన్‌సీడీ 30 యాప్‌లో ఆన్‌లైన్‌లో అన్ని వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో ఏదైనా లోపాలు ఉంటే సంబంధింత ఇంజనీర్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించుకునేలా చూసుకోవాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షల లక్ష్యాలను చేరుకొనే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ భగీరథి, మాస్‌మీడియా అధికారి శ్రీనివాసరావు, ఎపిడమాలజిస్ట్ విక్టర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

ఒంగోలు నగరంలోని ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలో విధిగా నిబంధనల పాటించాలని, అనుమతులు లేకుండా పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దరఖాస్తులో నమోదు చేసిన డాక్టర్ వివరాలను ప్రతి స్కానింగ్ రూము బయట ఉంచాలని చెప్పారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పెన్షన్ల పరిశీలన

పీసీపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నుంచి హెల్త్ పెన్షన్లు అందుకుంటున్న లబ్ధిదారులను ప్రత్యేక వైద్యబృందం మంగళవారం తనిఖీ చేసింది. గుదేవారిపాలెం, నేరేడుపల్లి, మురుగుమ్మి, గుంటుపల్లి తదితర గ్రామాల్లో 18మంది పక్షవాతం, ఇతర అనారోగ్య కారణాలతో నెలకు 15,000 రూపాయల వంతున హెల్త్‌పెన్షన్లు పొందుతున్నారు. అయితే ఈ హెల్త్‌పెన్షన్లలో గత ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయని భావించిన కూటమి ప్రభుత్వం తనిఖీకి ఆదేశించింది.ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా నియమించిన డాక్టర్ల బృందం ఆయా గ్రామాలకు చేరుకుని హెల్త్‌పెన్షన్ పొందుతున్న వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. వారు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు, వారి దగ్గర ఉన్న ట్రీట్‌మెంట్‌కు సంబంధించిన పత్రాలు, ప్రస్తుతం వారు ఉన్న ఫిట్‌నెస్ స్థితిని పరిశీలించి రికార్డు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యబృందంతో పాటు ఎంపీడీవో ప్రభాకరశర్మ, ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

పామూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు పంచాయతీ జంగాలపల్లి గ్రామంలోని గంగమ్మతల్లి దేవస్థానానికి వెళ్లేందుకు మంజూరైన సీసీ రోడ్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మంగళవారం భూమి పూజ నిర్వహించారు.

నేతన్నలు, మత్స్యకారుల అభివృద్ధికి పాటుపడతా

ఎమ్మెల్యే కొండయ్య



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, వేదికపై మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు, కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నేతన్నలు, మత్స్యకారుల అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. మంగళవారం దేవాంగపురి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ.47.50 లక్షలతో రోడ్డు నిర్మాణాలు చేయగా వాటిని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యేలు నరేంద్రవర్మరాజు, కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండ య్య మాట్లాడుతూ తాను అధికారంలోకి రాక మునుపు పంట కాలువలు గుర్రపు డెక్కలతో నిండి పారుదల లేక రైతులు ఇబ్బందులు పడుత్నుట్లు చెప్పారు. కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే రూ.కోటి సాయంతో నియోజకవర్గంలోని పంట కాలువలకు పూడికలు తీయించినట్లు చెప్పారు. నేడు కాలువలు కళకళలాడుతున్నాయన్నారు. సముద్రతీరంలో హార్బర్‌తో ఉద్యోగం ఉపాధి ఉంటుందన్నారు. వాటిపై దృష్టి సారించి పరిష్కరిస్తామన్నారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు మాట్లాడుతూ చీరాల పరిధిలో చేనేతలు అధికమని నిరంతరం శ్రమిస్తున్న శ్రమ జీవులని అన్నారు. పవర్‌లూమ్‌తో పోటీ పడుతు నేతన్నలు అవస్థలు పడుతున్నట్లు వివరించారు. సముద్రతీరంలో మత్స్యకారులు ఉపాధికి తిప్పలు పడుతున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే నిత్యం ఎమ్మెల్యే కొండయ్యతో సూర్యలంక నుంచి వాడరేవుకు రోడ్ల నిర్మాణం, హార్బర్, టూరిజం, చేనేత పార్క్ వంటి అంశాలపై చర్చిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే కొండయ్యను సొంత బిడ్డలా ఆదరించాలని ఇకపై ఆయన ఇక్కడ నివాసిగా మారేందుకు పూనుకున్నారని కొనియాడారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల అభ్యున్నతికి కొండయ్య పాటుపడుతున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ హార్బర్ నిర్మాణానికి డీపీఆర్ అనుమతులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో 4మాత్రమే మునిసిపాలిటీలు ఉండగా, 80 శాతం గ్రామీణ ప్రాంతాల నిరుపేదలు ఉన్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 868 సీసీ రోడ్లు మంజూరు కాగా, వాటికి సంబంధించి 157 కిలో మీటర్ల మేర రూ.91కోట్లు అంచనా జరిగినట్లు చెప్పా రు. ఇప్పటికే వాటిల్లో 70 శాతం పనులు పూర్తయినట్లు చెప్పారు. ఒక్క చీరాల్లోనే ప్రస్తుతం రూ.5కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, డ్వామా పీడీ విజయలక్ష్మి, హ్యాండ్‌లూమ్ ఛైర్మన్ సజ్జా హేమలత, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కూరగాయల మార్కెట్ వ్యాపారులతో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

కొత్త కూరగాయల మార్కెట్‌లో ఉద్రిక్తత

- ఆరుబయట వ్యాపారాల తొలగింపు
- అడ్డుకున్న వ్యాపారులు
- అధికారులతో వాగ్వాదం
- 3 గంటలపాటు గందరగోళం

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని కూరగాయల మార్కెట్‌లో అనధికారిక వ్యాపారాలపై మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. కేటాయించిన దుకాణాల్లో కాకుండా ఆరుబయట వ్యాపారాలను తొలగించారు. కొందరు వ్యాపారులు అడ్డుకోవడంతో మంగళవారం ఉదయం ఉదిక్త పరిస్థితి ఏర్పడింది. ఊరచెరువులోని కూరగాయల మార్కెట్‌లో దుకాణాలను బహిరంగ వేలం ద్వారా వ్యాపారులకు చాలా కాలం క్రితమే కేటాయించారు. కొందరు వ్యాపారులు తమ దుకాణాల్లోకి వెళ్లకుండా ఆరుబయట అమ్ముతన్నారు. దీనిపై వ్యాపారులను కార్పొరేషన్ అధికారులు హెచ్చరించారు. అయినా ఆరుబయట దుకాణాలను తొలగించలేదు. మంగళవారం ఉదయం పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు మార్కెట్‌లో ఆరుబయట అమ్మకాల దుకాణాలను తొలగించారు. కొందరు వ్యాపారులు అధికారులకు సహకరించారు. మరికొందరు మాత్రం అడ్డుపడ్డారు. తమ జీవనోపాధిని దెబ్బతీయడానికి వీల్లేదని పట్టుపట్టారు. వ్యాపారులు, అధికారుల మధ్య కొద్దిసేపు వాదులాట జరిగింది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు మార్కెట్‌లో ఇదే గందరగోళం నెలకొంది. వ్యాపారుల్లో కొందరు వైసీపీ సానుభూతిపరులున్నారు. వీరు కొన్నేళ్లుగా కూరగాయల మార్కెట్‌ను తమ కనుసన్నల్లో శాసిస్తూ వచ్చారు. ఇతర సాధారణ వ్యాపారులు సానుకూలంగానే తమ దుకాణాలు తొలగించుకున్నప్పటికీ వైసీపీ సానుభూతిపరులు మాత్రం రాద్ధాంతం చేశారు. రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. 'మేం ఎన్నో ఏళ్లుగా ఉంటున్నాం. మాజోలికి ఎవరూ రాలేదు. మీరెవరు?' అంటూ కార్పొరేషన్ సిబ్బందిపై వాగ్వాదానికి దిగారు.

- కలెక్టరేట్ ఎదుట నిరసన

మార్కెట్‌లో వ్యాపారాలను తొలగించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రకాశం భవనం వద్ద కూరగాయల వ్యాపారులు నిరసన చేపట్టారు. ఆ సంఘ నాయకుడు చీకటి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇక్కడ కొన్నేళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్నారని, అర్ధంతరంగా దుకాణాలు తొలగించడం ద్వారా వ్యాపారులు జీవనోపాధి కోల్పోతారని తెలిపారు. కార్పొరేషన్ అధికారుల వ్యవహరించిన తీరును తాము ఖండిస్తున్నామన్నారు.

- నిబంధనల ప్రకారమే వ్యాపారాలు చేయాలి

మార్కెట్‌లో ఆరుబయట వ్యాపారాలు నిషేధం. మునిసిపల్ నిబంధనల ప్రకారం బహిరంగ వేలంపాట ద్వారా షాపులు కేటాయించాం. దుకాణాలు పొందినవారు అందులో వ్యాపారాలు చేయడం లేదు. కొందరైతే అసలు పన్నులు కూడా చెల్లించడం లేదు. రెవెన్యూ సిబ్బంది అడిగితే తాము షాపులో ఉండటం లేదంటూ దురుసుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై చర్యలకు సిద్ధమయ్యాం. ఇకపై ఎవరి దుకాణాల్లో వారే అమ్మకాలు చేసుకోవాలి. నిబంధనలు అతిక్రమించి బయట వ్యాపారాలు చేస్తే శాఖపరంగా చర్యలు తీసుకుంటాం. అందులో భాగంగానే తొలగింపు చేయాల్సి వచ్చింది.

- వెంకటేశ్వర్లు, ఓఎంసీ కమిషనర్

కూరగాయల మార్కెట్‌ను పరిశీలించిన మార్కెటింగ్ కమిషనర్



కూరగాయల మార్కెట్‌లో టమాటా బాక్సులను పరిశీలిస్తున్న మార్కెటింగ్ కమిషనర్ విజయసునీత,డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీరాణి, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

మార్టూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు కూరగాయల మార్కెట్‌ను మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీరాణి, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి మార్కెటింగ్ కమిషనర్ ఎం.విజయసునీత పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మార్కెట్‌లో కూరగాయలను, టమాటా బాక్సులను, బస్తాలలో ఉన్న మిర్చిని ఇతర కూరగాయల గంపలను పరిశీలించారు. అదేవిధంగా కూరగాయలను ఎక్కడ నుంచి తీసుకువస్తున్నారు, వాటి ధరలు ఎలా ఉన్నాయి, రైతులకు గిట్టుబాటు అవుతుందా లేదా తదితర విషయాలపై రైతులతో మాట్లాడారు. అనంతరం కూరగాయల మార్కెట్‌లో రైతులకు తగిన వసతులు ఉన్నాయా, మార్కెట్‌లో తాగునీరు ఉందా లేదా తెలుసుకున్నారు. సుగాలితండాకు వెళ్లే దారిలో ఉన్న మార్కెటింగ్ శాఖకు చెందిన గోడౌన్ ను పరిశీలించారు. మందు బాబులు ఈ గౌడౌన్ ప్రాంగణాన్ని వారి అవసరాలకు వినియోగించుకుంటున్నారని పలువురు రైతులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గోడౌన్ ప్రాంగణ అభివృద్ధికి రూ.45లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. పర్చూరు మార్కెట్ పరిధిలో రూ.కోటి వ్యయంతో 11 పనులకు ప్రతిపాదనలు పంపినట్లు పర్చూరు యార్డు సెక్రటరీ డీటీ తిరుపతిరాయుడు కమిషనర్‌కు తెలిపారు. కార్యక్రమంలో డీఈ పవన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పచ్చిమిర్చి కూరగాయల మార్కెట్‌లో ఒక బిల్డింగ్‌ను సివిల్ సప్లయిస్ వారు బియ్యం, తదితర వస్తువులను నిల్వ ఉంచడానికి చాలా కాలంగా స్టాక్ పాయింట్‌గా వినియోగిస్తున్నారు. అయితే ఈ బిల్డింగ్‌ను కూరగాయల వ్యాపారులకు కేటాయిస్తే వాటిలో కమీషన్ ఏజెంట్లకు దుకాణాలు కేటాయించాలని మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సాంబశివరావు మార్కెటింగ్ కమిషనర్ విజయసునీత దృష్టికి తీసుకువెళ్లారు. పలు సమస్యల పరిష్కారంపై ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మార్కెట్‌కు చెందిన దారా రామారావు, శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు, శంకర్ పాల్గొన్నారు.

వైన్‌షాపులో చోరీ

- ఖరీదైన మద్యం బాటిళ్లు అపహరణ
- శాంతినగర్‌లో ఘటన
- రూ.4లక్షల విలువ ఉండవచ్చని అంచనా
- పరిశీలించిన సివిల్, ఎక్సైజ్ అధికారులు, వేలిముద్రల సేకరణ
- శింగరకొండ సమీపంలోని మూడు దుకాణాల తాళాలు పగులగొట్టిన దొంగలు



శాంతినగర్ వద్ద చోరీ జరిగిన మారుతీ వైన్స్, చోరీజరిగిన వైన్‌షాపును పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాజు, షాప్‌లో కట్ చేసిన సీసీ కెమెరాల వైర్లు

అద్దంకి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపులో చోరీకి పాల్పడ్డ దొంగలు ఖరీదైన మద్యాన్ని ఎంచుకొని అపహరించుకు పోయారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. అద్దంకి మండలంలోని శాంతినగర్ (కలవకూరు డొంక) వద్ద మారుతీ వైన్స్ శింగరకొండ సమీపంలో మూడు షాపులలో సోమవారం అర్ధరా త్రి దాటిన తరువాత చోరీలు జరిగాయి. మద్యం షాపులో సుమారు రూ.4లక్షల వైలువైన వివిధ బ్రాండ్ల మద్యం అపహరించుకు పోయారు. శింగరకొండ సమీపంలో శ్రీకృష్ణ మందిరం పక్కన ఉన్న మూడు దుకాణాల షట్టర్‌ల తాళాలు పగులగొట్టారు. రెండు దుకాణాలలో ఏమీ లేకపోగా, ఒక దుకాణంలో ఉన్న 3 యాంపిల్ ఫైర్లు, ఒక కీబోర్డు దొంగిలించుకుపోయారు. ప్రత్యేక వాహనంలో వచ్చిన దొంగలు వైన్‌షాపు రేకులను తొలగించి లోపలకు ప్రవేశించారు. అందులో ఉన్న 10 కేసుల మద్యంను గోతాలలో వేసుకొని తమ వెంట తెచ్చుకున్న వాహనంలో తీసుకు పోయినట్లు తెలుస్తుంది. కాస్ట్లీ మద్యంను ఎంపిక చేసుకొని తీసుకొని పోయి మిగిలిన తక్కువ రకం బ్రాండ్ల మద్యంను మాత్రం అక్కడే వదిలి వేశారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ముందుగానే కట్ చేసి స్టోరేజ్ యూనిట్ ను కూడా తీసుకు పోయారు.

ఒంటి గంట నుండి 3 గంటల మధ్య లో రెండు చోరీలు జరిగినట్లు భావిస్తున్నారు. శింగరకొండ దేవాలయం వైపు పోలీస్ లు నైట్ బీట్ కు ఒంటి గంట సమయంలో వెళ్ళినప్పుడు ఎలాంటి చోరీ జరగలేదు. మరలా 3గంటల సమయంలో అటు వైపు పోలీస్ లు వెళ్తుండగా మూడు షాపుల షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అదే దొంగల ముఠా బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు వద్ద వైన్‌షాపు వద్ద వాచ్‌మెన్ ను బెదిరించి చోరీ కి పాల్పడ్డారు. చోరీ జరిగిన వైన్‌షాపు ను ఎక్సైజ్ సిఐ భవాని పరిశీలించారు. శింగరకొండ సమీపంలో చోరీ జరిగిన షాపులను, శాంతినగర్ వద్ద చోరీ జరిగిన వైన్ షాపు ను అద్దంకి టౌన్ సిఐ సుబ్బరాజు, ఎస్సై ఖాదర్‌బాషా లు పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందం వేలిము ద్రలు సేకరించారు. వైన్‌షాపు నౌకరనామా కొల్లా పుల్లారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొప్పెరపాడులో..

- వాచ్‌మన్‌పై దాడి
- తాళాలు పగులగొట్టి రూ.20వేలు, 4 కేసుల మద్యం అపహరణ
- కొప్పెరపాడులో ఘటన



వైన్‌షాపులో నగదు చోరీ చేసి లాకర్‌ను బయటపడేసి వెళ్లిన దొంగలు



అర్ధరాత్రి దొంగల దాడిలో గాయపడిన వాచ్‌మన్ సామ్యేల్

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వైన్ షాప్‌లో మంగళవారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పక్కన కొప్పెరపాడు గ్రామం వద్ద ఉన్న అంకమ్మ తల్లి వైన్స్‌లో గుర్తుతెలియని దొంగలు మూకుమ్మడిగా వచ్చి కాపాలాగా ఉన్న వాచ్‌మన్‌పై దాడి చేసి తాళాలు పగలగొట్టి దుకాణంలో ఉన్న రూ.20వేల నగదు, నాలుగు కేసుల మద్యం సీసాలను అపహరించుకుపోయారు. అందిన సమాచారం మేరకు రాష్ట్రీయ రహదారి ప్రక్కనే కొప్పెరపాడు సమీపంలో అంకమ్మ తల్లి వైన్స్ ఉంది. అక్కడ వాచ్‌మన్‌గా తంగిరాల సామ్యేల్ కాపాలాగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో కొందరు దుకాణం సమీపంలో ఉండగా ఈవిషయాన్ని వెంటనే అయన దుకాణ యజమానులకు తెలిపారు. వారు వచ్చి కొంత సేపు దుకాణం వద్ద ఉన్నారు. కొత్త వ్యక్తులు ఎవరూ లేకపోవడంతో యజమానులు ఒంటి గంట సమయంలో ఇళ్లకు వెళ్లారు. తదుపరి వాచ్‌మెన్ అక్కడ ఉండగా ఒక కారులో ఎనిమిది వచ్చి వాచ్‌మన్‌పై దాడి చేసి గొంతుపై కాలు వేసి తాళాలు పగులగొట్టి లాకర్‌ను బయటకు తీసుకొచ్చి అందులో ఉన్న రూ.20వేల నగదును, రూ.30వేల విలువైన నాలుగు మద్యం కేసులను చోరీ చేశారు. దొంగలు వెళ్లిన వెంటనే వాచ్‌మన్ దుకాణ యజమానులకు సమాచారమివ్వగా, నిర్వాహకుడు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు, ఎస్ఐ జీవీ చౌదరి చోరీ జరిగిన వైన్ షాపును పరిశీలించి వాచ్‌మన్ నుంచి చోరీ వివరాలను సేకరించారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే రాష్ట్రీయ రహదారిలో చోరీ జరగడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయపరంగా నష్టపరిహారం

రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే ఉగ్ర సూచన



హైవే భూ బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న ఉగ్ర

సీఎస్‌పురం(పామూరు) జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయంగా నష్టపరిహారం అందజేయాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. సీఎస్‌పురం తహసీల్దార్ కార్యాలయంలో హైవే భూ బాధితులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. భూసేకరణలో భూములు కోల్పోయిన రైతుల భూములకు సంబంధించిన రికార్డులను ఆర్డీవో కేశవవర్దనరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతు రైతుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.హైవే భూ బాధితులకు నష్ట పరిహారం సొమ్ములు త్వరితిగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీజీపేట, గుంతచెన్నంపల్లి, రేగులచెలుక గ్రామాల మీదుగా సాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే, 167- బీ హైవే పనులను పరిశీలించారు. రహదారుల నిర్మాణంతో గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు. భూ సేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వ పరం గా అన్నివిధాలుగా సహాయసహకారం అందజేస్తామని, అందుకు రైతులు కూడాసహకారం అందించాలని కోరారు. సర్వేనెంబర్ 224/1 లో గల భూమి ప్రభుత్వ భూమి ల్యాండ్ పూలింగ్‌లో ఉందని, ఎవరు కొనుగోలు చేసినా చెల్లదని ఆర్డీవో తెలిపారు. రైతుల భూములు జీరో ఖాతాలో పడటం వలన జిల్లా ఉన్నాతాధికారులకు నివేదిక పంపించి రికార్డులను సరి చేసి రైతులకు త్వరగా న్యాయం జరిగేలా రెవెన్యూ అధికారులు కృషిచేయాలని ఉగ్ర సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి. వెంకటేశ్వర్లు, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, యారవ శ్రీనువాసులు, బోయిళ్ల నారాయణరెడ్డి, ఎస్‌సీ మాలకొండయ్య, నీటి సంఘం అధ్యక్షుడు పావళి తిరుపతయ్య, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ శైవ క్షేత్రమైన భైరవకోన క్షేత్రాన్ని పరిశీలించారు. రానున్న మహా శివరాత్రి వేడుకలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఉగ్రనరసింహారెడ్డి సూచించారు.

నల్లవాగు భూమిపై గ్రానైట్ వ్యాపారుల పాగా



కొణిదెనలో నల్లవాగు భూమిని ఆక్రమించుకొని పెద్ద ఎత్తున వేసిన గ్రానైట్ వ్యర్థాలు



గ్రానైట్ వ్యర్థాలను వేసేందుకు ఏర్పాటు చేసిన కుంట



ప్రభుత్వ భూమిలో పైప్‌లైన్ ద్వారా పెడుతున్న వ్యర్థాలు



కుంచించుకుపోతున్న కొణిదెన నల్లవాగు భూమి

- కొణిదెన గ్రామంలో 54 ఎకరాల ప్రభుత్వ భూమి పరాధీనం
- జోరుగా వాగు భూముల అమ్మకాలు, కొనుగోళ్లు
- ఇష్టారాజ్యంగా వాటిలో గ్రానైట్ వ్యర్థాలు
- వారిపై చర్యలకు గతంలో మంత్రి ఆదేశాలు
- పట్టించుకోని అధికారులు

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వాగు భూములను కొందరు కొంతకాలం నుంచి ఆక్రమించుకొని ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేస్తున్నారు. కొందరు గ్రానైట్ వ్యాపారులు ప్రభుత్వ భూముల్లో పాగా వేసి గ్రానైట్ వ్యర్థాలను ఇష్టానుసారం పడేస్తున్నారు. ఎంతో విలువైన వాగు భూములు ఆక్రమణకు గురి కావడంతో ముందు ముందు రైతులకు తీవ్ర ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉంది. మండలంలోని కొణిదెన గ్రామంలో ఉన్న నల్ల వాగుకు సంబంధించి సర్వే నెంబరు 789/ఏ, 789/బీ, 761లో 54 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని కొంత కాలం నుంచి కొణిదెనకు చెందిన కొందరు ఆక్రమించుకుని తమ ఆధీనంలో పెట్టుకొన్నారు. కొందరు పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఈ భూమిని కొందరు గత కొన్ని నెలల నుంచి అమ్మకాలు చేస్తున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీలు నిర్వహించే కొందరు వ్యాపారులు ఈ భూమిని కొంత కొనుగోలు చేసి కొంత ఆక్రమించుకొని పెద్ద ఎత్తున వ్యర్థాలను పడవేస్తున్నారు. ఫ్యాక్టరీలలో వచ్చే డస్టును ప్రభుత్వ వాగు భూమిలోకి పెడుతున్నారు. దీంతో నల్ల వాగు రోజు రోజుకూ కుంచించుకుపోతోంది. ఎంతో విలువ కలిగిన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామ స్థాయిలో పనిచేసే అధికారులు కూడా కొందరు ప్రభుత్వ భూముల అమ్మకాల విషయం తెలిసిన మామూళ్ల మత్తులో పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు పక్కనే ఉన్న వాగు భూమిలో వ్యర్థాలను వేయడం వలన గాలులకు వచ్చే దుమ్ముతో పంటలు కూడా సరిగా పండే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పైప్‌లైన్‌లను ఏర్పాటు చేసి మరీ వ్యర్థాలను వాగు భూమిలోకి పెడుతున్నారని ఇలా అయితే ముున్ముందు వాగు భూమి కనుమరుగవుతుందని రైతులు తెలిపారు. నల్లవాగు నీటిపై ఆధార పడి ఎత్తిపోతల పథకం కూడా ఉందని పంటలకు నీరు సక్రమంగా రావాలంటే నల్లవాగును పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు. వాగు భూమిని ఆక్రమించుకున్న వారు కొందరు లక్షలు తీసుకొని మరొకరికి అమ్మకాలు చేయడంతో వివాదాలు కూడా తలెత్తుతున్నాయని పలువురు అంటున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే వాగు భూములను పరిశీలించి ఆక్రమణలబారి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వ్యర్థాలు వేసే వారిపై చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశాలు

బల్లికురవ మండలంలో ప్రభుత్వ భూముల్లో గ్రానైట్ వ్యర్థాలు వేసే వారికి నోటీసులు ఇచ్చి వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి రవికుమార్ గతంలో అధికారులను ఆదేశించారు. అయినా నేటికీ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. రెండు నెలల కిందట బల్లికురవ ప్రజా వేదిక కార్యక్రమానికి వచ్చిన మంత్రి ప్రభుత్వ భూముల్లో వ్యర్థాలు వేస్తున్న వారికి నోటీసులు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



కొండమంజులూరులో జరిగిన వైద్య శిబిరంలో రోగ నిరోధక మందులను అందజేస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

పశుపోషకులు వైద్యుల సూచనలు పాటించండి

డాక్టర్ మురళీకృష్ణ

పంగులూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అధిక పాల దిగుబడి సాధించేందుకు పశు పోషకులు వైద్యుల సూచనలు పాటించాలని పశు వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ కోరారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య కేంద్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూడి మోసే సమయంలో గేదెలకు ఇంజక్షన్లు వేయించడం ద్వారా పడ్డ దూడలు పుట్టే అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించడంతో పాటు గేదెలకు ఎద పరీక్షలు నిర్వహించారు. పశువుల రోగ నివారణకు అవసరమైన మందులు అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు చింతల సహదేవుడు, ఏహెచ్ఏలు ప్రమీలాబాయ్, యశోద, భాగ్యజ్యోతి, పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొప్పెరపాలెం, మల్లాయపాలెం గ్రామాలలో మంగళవారం పశు అరోగ్య శిబిరాలు జరిగాయి. ఈసందర్భంగా వైద్యాధికారులు, మహేశ్వరరావు, పావనీకుమారి పశువులు, గొర్రెలు, మేకలకు, దూడలకు మందులను అందించారు. ఈసందర్భంగా వారు పశువుల వృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి పశుపోషకులకు వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది ప్రకాష్

అద్దంకిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, లేకుంటే మానవ మనుగడకే ప్రమాదమని న్యాయవాది ఎం.ప్రకాష్ అన్నారు. మంగళవారం రోటరీ కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆప్ శింగరకొండ, మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, లింగ నిర్ధారణ పరీక్షలు, వినియోదారుల హక్కుల పరిరక్షణ అనే అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మరో న్యాయవాది, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మహమ్మద్ రఫీ మాట్లాడారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ సీహెచ్.మురళీసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మర్త శ్రీనివాసరావు, అళహరి హరి ప్రసాద్, ఆంజనేయులు, చిన్ని కామేశ్వరరావు, కృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం కోశాధికారిగా చెన్నుపల్లి



సమావేశంలో రాష్ట్ర నాయకులతో చెన్నుపల్లి శ్రీనివాసరావు

అద్దంకిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం కోశాధికారిగా అద్దంకికి చెందిన చెన్నుపల్లి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలో ఈనెల 26న జరిగిన ఏపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చేకూరి రామస్వామి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్న చెన్నుపల్లి శ్రీనివాసరావు సంఘ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుకున్నారు విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని, ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర నాయకులకు శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా, అద్దంకి విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు చెన్నుపల్లికి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లాయపాలెంలో లారీ డ్రైవర్ ఆత్మహత్య

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కొత్త మల్లాయపాలెంలో లారీ డ్రైవర్ తంగిరాల పోతురాజు(37) మంగళవారం తన ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సీ కాలనికి చెందిన పోతురాజు గ్రానైట్ ముడి రాయి లారీలకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన ఊపిరితో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. పోతురాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అన్నదాతల అభ్యున్నతికి కృషి చేయాలి

- లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములన్నీ పునరుద్ధరించాలి
- రైతుల భాగస్వామ్యంతో పనిచేసేలా చూడాలి
- దళారులకు తావులేకుండా ధాన్యం కొనుగోలు చేయండి
- డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళవారం బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధి సమావేశం ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ అన్నదాతలకు కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు జిల్లా వ్యాప్తంగా అనేకం మూలన పడ్డాయని, గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్నారు. అన్ని స్కీములు పనిచేసేలా చూసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రైతుల భాగస్వామ్యంలో పనిచేసే వారికి అప్పగించాలన్నారు. ధాన్యం కొనుగోలు లక్ష్యాలను అధిగమించి, రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలన్నారు. దళారుల ప్రమేయాన్ని అరికట్టి రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటికి రోడ్లన్నీ మరమ్మతులు చేపట్టామని, మిగిలిన రోడ్ల మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్ఆర్‌జీఎస్ ద్వారా పనులు పూర్తి అయిన వాటికి బిల్లులు తక్షణమే చెల్లించే విధంగా చూడాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2014-19 అభివృద్ధి పనుల బిల్లులు నిలిపివేశారన్నారు. ప్రధానంగా ఎస్‌డిఎఫ్, డీఎంఎఫ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పనులకు అనుకూలమైన వారికి బిల్లులు చెల్లించి మిగతావారికి నిలిపి వేశారన్నారు. వాటిపై విచారణ చేసి బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు.

ఎస్సీ హాస్టల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

- మంత్రి రవికుమార్ ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు



వసతి గృహం ఏర్పాటుపై గ్రామస్థులు, అధికారులతో మాట్లాడుతున్న వెల్ఫేర్ ఆఫీసర్ యువ స్వరూప

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు బల్లికురవలో ఎస్సీ హాస్టల్ ఏర్పాటుకు అధికారులు రంగంలోకి దిగారు. గత రెండు మాసాల కిందట బల్లికురవ ప్రజా వేదిక కార్యక్రమానికి హాజరైన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను బల్లికురవ, పరిసర గ్రామాలకు చెందిన ఎస్సీ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీంతో మంత్రి రవికుమార్ వసతి గృహం ఏర్పాటు చేసేలా అధికారులకు ఆదేశాలు పంపారు. మంగళవారం అద్దంకి సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ డి.యువ స్వరూప మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కుసుమకుమారిని కలిసి వసతి గృహం ఏర్పాటుకు అవసరమైన వివరాలను సేకరించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో ఎంఈవో వస్త్రం నాయక్, రమేష్‌ను, ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావును, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌ను గ్రామ పెద్దలను కలిసి వసతి గృహం ఏర్పాటుపై వారి నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇక్కడ హాస్టల్ ఏర్పాటుతో పరిసర 10 గ్రామాల విద్యార్థులకు ఎంతో ఉపయోగమని పెద్దలు వెల్ఫేర్ అధికారికి వివరించారు. వసతి గృహం ఏర్పాటుకు తాము ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని ఈసందర్భంగా సోషల్ వెల్ఫేర్ అధికారి తెలిపారు.

ముగ్గురు జేబుదొంగల అరెస్ట్

మార్టూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు జేబు దొంగలను సోమవారం అరెస్ట్ చేసి మంగళవారం దర్శి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ సైదా తెలిపారు. ఆ వివరాలను ఎస్ఐ తెలిపారు. ఈ నెల 26 వతేదీ ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఏలూరి పుట్టినరోజు వేడుకలలో నలుగురు వ్యక్తుల దగ్గర ముగ్గురు జేబుదొంగలు దొంగతనం చేశారు. దాంతో ఈ ముగ్గురు చీరాల మండలం వాడరేవుకు చెందిన గోదావరి గోపి, తాడేపల్లికి చెందిన గోదావరి ఏసు, స్టూవర్టుపురానికి చెందిన కర్రెద్దుల వంశీని ఎస్ఐ సైదా అరెస్ట్ చేశారు. వారి దగ్గర రూ.63వేలు నగదును, సెల్‌ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో వారికి 14 రోజులు రిమాండ్ విధించగా మంగళవారం ఒంగోలు జైలులో హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం షాపు టెండర్‌కు గీత కులాలకు ఆహ్వానం

పర్చూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం మద్యం షాపు టెండర్‌లో గీత కార్మికులకు 10శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు పర్చూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భుజంగరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు.
పర్చూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇంకొల్లు మండల పరిధిలో సబ్ కాస్ట్ గౌడ్ (గౌడ) కులస్తులకు ఒక షాపును కేటాయించినట్లు చెప్పారు. ఈషాపు టెండర్‌కు బాపట్ల జిల్లాలో ఉన్న గౌడ కులస్తులు అర్హులన్నారు. షాపు టెండర్ కోసం ఫిబ్రవరి 2 సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరకాస్తులను ఆన్‌లైన్ ద్వారా కానీ ఆఫ్‌లైన్ ద్వారా కానీ స్వీకరిస్తారని తెలిపారు. అప్లికేషన్ నాన్-రిఫండబుల్ ఫీజు రూ.2లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి కల్గిన గీత కులస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బుజంగరావు ఆ ప్రకటనలో తెలిపారు.



మహిళాభివృద్ధి, సంక్షేమ శాఖ జేడీ మనోరంజనికి వినతిపత్రం అందజేస్తున్న తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ వినతి

అద్దంకిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మంగళవారం గుంటూరులోని కమిషనర్ కార్యాలయంలో మహిళాభివృద్ధి, సంక్షేమ శాఖ జేడీ పి.మనోరంజని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేడీ మనోరంజని మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్‌లు మృతి చెందిన క్రమంలో మట్టి ఖర్చులు నిమిత్తం జీవో విడుదల చేసినట్లు చెప్పారు. గ్రాట్యుటీపై త్వరలో జీవో వస్తుందన్నారు. కూరగాయలు, గ్యాస్ బిల్లులు పెంచుతూ ఆదేశాలు వచ్చాయన్నారు. వేతనాల పెంపు విషయం మంత్రితో ఇప్పటికే మాట్లాడినట్లు చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొల్లి లక్ష్మి నరసమ్మ, ఉపాధ్యాక్షురాలు చెరుకూరు సామ్రాజ్యం ఉన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిరండి

అద్దంకిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఫిబ్రవరి 7న మంద కృష్ణమాదిగ నాయకత్వంలో తలపెట్టిన లక్ష డప్పులు - వేయి గొంతులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని నియోజకవర్గ బాధ్యులు తేల శ్రీనివాసరావు, పూనూరు రమేష్ మంగళవారం ప్రకటన ద్వారా కోరారు. నియోజకవర్గంలోని మాదిగ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.



హాజరైన భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న గణపతిసచ్చిదానందస్వామి

మంచి పనులతో మానవ జన్మకు సార్థకం

గణపతి సచ్చిదానందస్వామీ

అద్దంకి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : భగవంతుడు ప్రసాదించిన మానవ జన్మను మంచి పనులు చేయడం ద్వారా సార్థకం చేసుకోవాలని గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. పట్టణంలోని దత్తపాదుకా క్షేత్రానికి మంగళవారం రాత్రి దత్తపాదుకా క్షేత్రానికి మైసూరు అవధూత దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామీ, దత్త విజయానంద తీర్థ స్వామీజీ వచ్చారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి గణపతి సచ్చిదానందస్వామీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ శక్తి మేర మంచిని ఆచరిస్తూ, మంచి పనులు చేయాలన్నారు. దేవాలయాలను పరిరక్షించి సనాతన ధర్మాన్ని పాటించాలన్నారు. దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తే పుణ్యం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దాన ధర్మాలు చేయాలన్నారు. అనంతరం దివ్య నామ సంకీర్తన సాగింది. బుధవారం ఉదయం శ్రీచక్రార్చన, శ్రీధన్వంతరీరాగ సాగర కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో దత్త కమిటీ అధ్యక్షుడు నాగసూరి హనుమత్ ప్రసాద్, కురిచేటి వెంకటసుబ్బారావు, చిన్ని, సందిరెడ్డి శ్రీనివాసరావు, చామర్తి మల్లిఖార్జునరావు, మామిడి రాంబాబు, సుబ్బారావు, కూరపాటి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

31న మున్సిపల్ సాధారణ సమావేశం

అద్దంకి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషర్ రవీంద్ర తెలిపారు.

మంచు నుంచి పంటలను కాపాడుకోవాలి



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీవాసరావు, ఏవో కుమారి

బల్లికురవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మంచు వాతావరణం వలన పాలు పోసుకునే దశలో ఉన్న మొక్కజొన్నకు మానుగాయ తెగులు వచ్చే ప్రమాదం ఉందని, రైతులు తగు జాగ్రత్తలు పాటించి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ మార్టూరు సబ్ డీవిజన్ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండలంలోని నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం గ్రామాలలో పోలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు మొక్కజొన్నను పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలను ఇచ్చారు. రైతులకు వచ్చే నెలలో ప్రత్యేక గుర్తింపు నెంబర్లను కేటాయిస్తామని, ఇక నుంచి ప్రభుత్వ పథకాలు ఐడీ నెంబర్లు ఉన్న రైతులకే వర్తిస్తాయని తెలిపారు. రైతులు పంటలు సాగు చేసిన వెంటనే ఈక్రాప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సుభాని, లక్ష్మణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కల్పన, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో భూమి సారవంతం

పంగులూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తొలకరిలో పచ్చిరొట్ట పైరు సాగుతో భూమి సారవంతం అవుతుందని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని అలవలపాడు, జాగర్లమూడివారిపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పచ్చిరొట్ట పైర్లు సాగు చేపట్టి పూత దశలో దుక్కిలో కలియ దున్నాలన్నారు. సాగులో ఉన్న శనగ, మొక్కజొన్న పైర్లను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై సూచనలు చేశారు. రబీలో సాగు చేస్తున్న పంటలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో కోటేశ్వరరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, మహేష్, నన్నేసాహెబ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది శైలేష్, ఫిలిప్‌రాజు, దిల్జా, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అవార్డులు బాధ్యతను పెంచుతాయి

తహసీల్దార్ గోపీకృష్ణ



తహసీల్దార్ గోపీకృష్ణను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగీ విధి నిర్వహణలో పొందిన అవార్డులు వారి బాధ్యతలను మరింత పెంచుతాయని, వాటిని సాధించడమే కాకుండా ఆ విలువలను కాపాడుకోవాలని తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా ఉత్తమ సేవా ఆవార్డును తహసీల్దార్ అందుకున్నారు. మంగళవారం కార్యాలయంలో సిబ్బంది అభినందన సభ నిర్వహించారు. తహసీల్దార్ సేవలను, సహచరుల పట్ల వ్యవహరించే తీరును కొనియాడారు. అవార్డు రావడానికి సహకరించిన ప్రతిఒక్కరికీ తహసీల్దార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీపై అవగాహనతో ప్రయోజనం

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక టెక్నాలజీకి సంబంధించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అన్నారు. మంగళవారం కళాశాలలో హెకథాన్ ఆన్‌ఏఐ ఫుల్‌స్టాక్ కార్యక్రమాన్ని నిర్వహించగా సీఎస్ఈ విభాగం రెంచిజీ, మూడవ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. ఈక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.జగదీష్ మాట్లాడుతూ ఐటీ పరిశ్రమలలో నైపుణ్యత ప్రదర్శనకు శిక్షణ ఉపయోగపడుతాయని వివరించారు. సీఎస్ఈ విభాగాధిపతి డా.పి.హరిణి, కోఆర్డినేటర్ శేషసాయి విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి